


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 216 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) పచురణ : తాడేపల్లిగూడెం సోమవారం 15 జూన్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 216 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM MON 15 JUNE 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

## మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు... కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం



- సోషల్ మీడియాలో కనిపించని వైసీపీ అధికారిక ఫేస్‌బుక్ పేజీ
- చంద్రబాబు ప్రభుత్వంపై జగన్ తీవ్ర ఆరోపణలు
- ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తున్నందుకే ఈ చర్యలన్న జగన్
- పేజీని వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్
- న్యాయపరంగా పోరాడతామని స్పష్టీకరణ

**పెన్ పవర్ డెస్క్:**వైసీపీ అధినేత జగన్ ఏపీ కూటమి ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తమ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ పేజీని భారతదేశంలో కనిపించకుండా చేశారని, ఇది ప్రతిపక్షాల గొంతు నొక్కే చర్యేనని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలను, అవినీతిని ప్రశ్నిస్తున్నందుకే కక్షపూరితంగా ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో తమ పార్టీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాను తొలగించారని, ఇప్పుడు ఫేస్‌బుక్ పేజీని లక్ష్యంగా చేసుకున్నారని జగన్ ఒక ప్రకటనలో తెలిపారు. "ఇది కేవలం వైసీపీపై జరిగిన దాడి కాదు. ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన దాడి" అని ఆయన పేర్కొన్నారు. ఇలా ప్రతిపక్ష పార్టీ అధికారిక ఖాతాలను నిలిపివేయడం ప్రమాదకరమని, ఇది పూర్తిగా అప్రజాస్వామికమని అన్నారు. అమరావతి రాజధాని ఖర్చులు, డీఎస్సీ ప్రక్రియలో అవకతవకలు, టీటీడీ నెయ్యి టెండర్లు వంటి అంశాలపై ఆధారాలతో సహా అవినీతిని బయటపెడుతుండటంతోనే ప్రభుత్వం ఇలాంట

- మిగతా 2లో



## పల్నాడు జిల్లాలో విషాద ఘటన... కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురి మృతి

- పల్నాడు జిల్లాలో ఘోర పడవ ప్రమాదం
- బంధువుల ఇంటి వేడుకకు వెళ్లి తిరిగొస్తుండగా ఘటన
- పడవలో ఉన్న 10 మందిలో ఇద్దరు మృతి, ఇద్దరు గల్లంతు
- ఆరుగురిని సురక్షితంగా కాపాడిన స్థానికులు
- గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలోని పల్నాడు జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అచ్చంపేట మండలం, కోనూరు గ్రామం వద్ద కృష్ణా నదిలో ఓ పడవ బోల్తా పడిన ఘటనలో నలుగురు మృతి చెందారు. మృతుల్లో ముగ్గురు చిన్నారులు ఉన్నారు. వివరాల్లోకి వెళితే, కోనూరు గ్రామంలోని కుంకలగుంట గంగయ్య అనే వ్యక్తి ఇంటికి బంధువులు వేడుక కోసం వచ్చారు. అనంతరం, సరదాగా గడిపేందుకు 10 మంది కలిసి ఒక చిన్న పడవలో నదిలో షికారుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో పడవ అదుపుతప్పి ఒక్కసారిగా బోల్తా పడింది. దీంతో పడవలో ఉన్నవారంతా నీటిలో మునిగిపోయారు.ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. వారు ఆరుగురిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు.

- మిగతా 2లో




## ఏపీకి వర్ష సూచన.. పలు జిల్లాలకు హెచ్చరిక



- దక్షిణ కోస్తాంధ్ర నుంచి తమిళనాడు వరకు విస్తరించిన అల్పపీడనం
- ఏపీలోని పలు జిల్లాలకు వర్ష సూచన జారీ
- కొన్ని జిల్లాల్లో ఉరుములతో కూడిన మోస్తరు వర్షాలు
- మరికొన్ని చోట్ల తేలికపాటి జల్లులు పడే అవకాశం
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారుల సూచన

- మిగతా 2లో

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం... పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

- మహారాష్ట్రలోని షోలాపూర్ జిల్లాలో ఘోర ప్రమాదం
- ప్రయాణికులతో వెళ్తున్న పికప్ వ్యాన్ అదుపుతప్పి బావిలో పడిన వైనం
- ఈ దుర్ఘటనలో 8 మంది అక్కడికక్కడే మృతి
- ఘటనా స్థలంలో సహాయక చర్యలు
- ప్రమాదానికి గల కారణాలపై పోలీసుల దర్యాప్తు



**పెన్ పవర్ డెస్క్:**మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. షోలాపూర్ జిల్లాలో ప్రయాణికులతో వెళ్తున్న ఓ పికప్ వ్యాన్ అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న బావిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో 8 మంది మృతి చెందినట్లు పోలీసులు ఆదివారం వెల్లడించారు. మృతుల్లో నలుగురు మహిళలు, నలుగురు చిన్నారులు ఉన్నారు. పోలీసులు అందించిన ప్రాథమిక వివరాల ప్రకారం, మృతులంతా పండరీపూర్ తాలూకా రంజని గ్రామానికి చెందిన సాగర్ చౌగులే కుటుంబ సభ్యులు, బంధువులుగా

- మిగతా 2లో



## ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన.. మేక్రాన్‌తో కలిసి చారిత్రక 'విల్లా కెర్లియోస్' సందర్శన

- ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ
- 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని ప్రారంభించిన మోదీ, మేక్రాన్
- దేశంలో స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరిస్తుందన్న మోదీ
- ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలపై చర్చలు జరపనున్న నేతలు

**పెన్ పవర్ డెస్క్:**ప్రధాని నరేంద్ర మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ ఆదివారం ఫ్రాన్స్‌లోని నీస్ నగరంలో ఉన్న చారిత్రక 'విల్లా కెర్లియోస్'ను సందర్శించారు. ఈ సందర్భంగా ఇద్దరు

- మిగతా 2లో

## గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు.. సీఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఇంజనీర్ల లేఖ



- గోదావరి వరద జలాలపై ఏపీకి సంపూర్ణ హక్కులున్నాయన్న రిటైర్డ్ ఇంజనీర్ల సంఘం
- గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టుకు మద్దతుగా సీఎం చంద్రబాబుకు లేఖ
- ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం మిగులు జలాలను వాడుకునే స్వేచ్ఛ ఏపీకి ఉందని వెల్లడి

- మిగతా 2లో

## కేసీఆర్ ప్రతి సంక్షేమ పథకం వెనక ఓ విజన్



**పెన్ పవర్ డెస్క్:** బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ తీసుకొచ్చిన ప్రతి సంక్షేమ పథకం వెనక ఓ విజన్ ఉందని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఆదివారం (జూన్ 14) హరీష్ రావు హనుమకొండ జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ పోవాలే కేసీఆర్ రావాలని జనం అంటున్నారని అన్నారు. సమాజంలో సామాజిక రుగ్మతలను దూరం చేసిన నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. చట్టాలు, పోలీసులు చేయలేని పనిని కళ్యాణలక్ష్మితో కేసీఆర్ చేశారని.. కళ్యాణ లక్ష్మీతో బాల్య వివాహాలు ఆగిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గాలపై రెండున్నర ఏళ్లుగా అవిశ్రాంతంగా కొట్లాడుతున్నామని అన్నారు. కార్యకర్తల అండదండలతోనే హైడ్రాలాంటి అరాచకాలపై పోరాడుతున్నామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు ఇప్పటినుంచే పార్టీ గెలుపు కోసం పని చేయాలని.. తెలంగాణలో మళ్లీ ఎగిరేది గులాబీ జెండానేని అన్నారు.

## ఎడిటర్ వ్యూ

# ఒప్పందం కుదిరేనా?

ఇరాన్-అమెరికా యుద్ధాన్ని ముగించే ఒప్పందం గతంలో కంటే ఇప్పుడు మరింత దగ్గరగా వచ్చిందని పాకిస్థాన్ శనివారం తెలిపింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఈ ఒప్పందం "రేపే సంతకం అవుతుంది" అని పేర్కొన్నారు. అయితే ఇరాన్ మాత్రం సానుకూల సంకేతాలు ఇస్తూనే, తుది నిర్ణయానికి ఇంకొంత సమయం అవసరమని స్పష్టం చేసింది.ఒప్పందం కుదిరిన వెంటనే హోర్ముజ్ జలసంధి తిరిగి తెరుచుకుంటుందని ట్రంప్ చెప్పారు.పాకిస్థాన్ ప్రధాని షెహ్‌బాజ్ షరీఫ్ మాట్లాడుతూ, మరో 24 గంటల్లో ఒప్పందం ఖరారు కావచ్చని తెలిపారు. రెండు పక్షాలు ఎలక్ట్రానిక్ విధానంలో సంతకాలు చేసే అవకాశం ఉందన్నారు. ఆదివారం సంతకాల కార్యక్రమం ఉండేలా ప్రణాళిక రూపొందించినట్లు పాకిస్థాన్ విదేశాంగ శాఖ వెల్లడించింది.

**ఏప్రిల్ 7 నుంచి...**

అయితే ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఘాయి రాష్ట్ర మీడియాతో మాట్లాడుతూ, "ఒప్పందం రేపు కుదరదు. కానీ వచ్చే కొద్ది రోజుల్లో అవగాహన పత్రం ఖరారయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి" అన్నారు.ఏప్రిల్ 7 నుంచి అమల్లో ఉన్న కాల్పుల విరమణ కొనసాగుతోంది. గత కొన్ని వారాలుగా ఒప్పందం తుది దశకు చేరిందని ట్రంప్ పలుమార్లు ప్రకటించారు.అమెరికాతో గత ఏడాది, ఈ ఏడాది ఆరంభంలో జరిగిన చర్చల తర్వాత అమెరికా, ఇజ్రాయెల్ దాడులు జరిగాయని గుర్తుచేస్తూ ఇరాన్ అప్రమత్తంగా వ్యవహరిస్తోంది.

**హోర్ముజ్ జలసంధిలో మైన్ల తొలగింపుపై జీ7లో చర్చ...**

సోమవారం ప్రారంభమయ్యే జీ7 సదస్సులో హోర్ముజ్ జలసంధిలో పేలుడు మైన్ల తొలగింపు అంశంపై ట్రంప్ చర్చించనున్నారు.వైట్‌హౌస్ నిబంధనల మేరకు పేరు వెల్లడించని ఓ అమెరికా అధికారి తెలిపిన వివరాల ప్రకారం, ట్రంప్ జీ7 సమావేశం సందర్భంగా ఈజిప్ట్, ఖతర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నాయకులతో భేటీ కానున్నారు. యుద్ధాన్ని పూర్తిగా నిలిపివేసే చర్యలపై చర్చిస్తారు.యుద్ధ విరామం కొనసాగితే మైన్ల తొలగింపు పనుల్లో సహకరించేందుకు బ్రిటన్, ఫ్రాన్స్ ఆసక్తి చూపాయి.యుద్ధం ప్రారంభమైన కొద్ది రోజులకే ఇరాన్ హోర్ముజ్ జలసంధిపై ప్రభావవంతమైన నియంత్రణ సాధించింది. దీంతో పర్షియన్ గల్ఫ్ నుంచి చమురు, సహజవాయు రవాణా దాదాపు నిలిచిపోయింది. దీనికి ప్రతిస్పందనగా అమెరికా ఇరాన్ నౌకాశ్రయాలపై దిగ్బంధం అమలు చేసింది.

**అణు కార్యక్రమం ఇంకా చిక్కుముడిగానే...**

ప్రస్తుతం చర్చలో ఉన్న అవగాహన పత్రం యుద్ధం ముగింపుకే పరిమితమని ఇరాన్ విదేశాంగ శాఖ తెలిపింది. "ఈ దశలో అణు అంశంపై ఎలాంటి చర్చ ఉండదు" అని బఘాయి చెప్పారు. ఇరాన్ అణు కార్యక్రమం, అధికంగా శుద్ధి చేసిన యురేనియం నిల్వలు చాలా కాలంగా అమెరికా, ఇజ్రాయెల్‌లతో విభేదాలకు కారణమవుతున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో కూడా ఇవి ఆందోళనకు దారితీశాయి. అయితే పరిస్థితులు సాధారణ స్థితికి చేరిన తర్వాత ఇరాన్‌లో గానీ, అమెరికాలో గానీ ఉన్న అధిక శుద్ధి యురేనియాన్ని తగ్గించి నాశనం చేస్తామని ట్రంప్ సామాజిక మాధ్యమాల్లో పేర్కొన్నారు.ఈ వారం ప్రారంభంలో ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్‌ల మధ్య జరిగిన పరస్పర దాడుల తర్వాత చర్చలు వేగం పుంజుకున్నాయి. అవి కాల్పుల విరమణను దెబ్బతీసి మళ్లీ మధ్యప్రాచ్యాన్ని పూర్తి స్థాయి యుద్ధంలోకి నెట్టే పరిస్థితి తీసుకొచ్చాయి.ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి శుక్రవారం ఎక్స్‌లో స్పందిస్తూ, "ఒప్పందం ఇంత దగ్గరగా ఎప్పుడూ రాలేదు" అని వ్యాఖ్యానించారు. మరోవైపు ట్రంప్ కూడా గురువారం గణనీయ పురోగతి సాధించామని చెప్పారు.

**జూలైలో ఖమేనీ అంత్యక్రియలు...**

యుద్ధం ప్రారంభ దాడిలో మరణించిన ఇరాన్ మాజీ అత్యున్నత నేత అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు జూలైలో నిర్వహించనున్నట్లు ఇరాన్ ప్రభుత్వ టెలివిజన్ తెలిపింది. షియా ముస్లింల సంతాప మాసమైన మొహర్రం సందర్భంగా జూలై 4 నుంచి 9 మధ్య అంత్యక్రియలు, ఖననం, నివాళి కార్యక్రమాలు జరుగుతాయి. ఖమేనీ వారసుడిగా ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ బాధ్యతలు చేపట్టారు. ఆయన మరింత కఠిన వైఖరితో ఉంటారని భావిస్తున్నారు. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఆయన బహిరంగంగా కనిపించలేదు. మొదట టెహ్రాన్‌లో అంత్యక్రియలు నిర్వహించి, తర్వాత ప్రముఖ షియా మత గురువుల కేంద్రంగా ఉన్న ఖోమ్‌కు, అక్కడి నుంచి ఖమేనీ స్వస్థలం మష్హద్‌కు తరలిస్తారు. అక్కడి ఇమామ్ రెజా పవిత్ర స్థలంలో ఆయనను ఖననం చేయనున్నారు. 1989లో అయతుల్లా రుహొల్లా ఖొమేనీ మరణం తర్వాత ఇస్లామిక్ రిపబ్లిక్‌ను ఖమేనీ కొత్త దిశగా నడిపించారు. ఆయన పాలన ఖొమేనీ కంటే ఎక్కువ కాలం కొనసాగింది.షియా మత గురువుల వ్యవస్థను విస్తరించడమే కాకుండా, రివల్యూషనరీ గార్డ్స్‌ను దేశంలో అత్యంత శక్తివంతమైన సంస్థగా తీర్చిదిద్దారు. సైనిక, వ్యాపార రంగాల్లో భారీ ప్రభావం కలిగిన ఈ బలగాలు దేశ బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థను కూడా పర్యవేక్షించాయి. యుద్ధ సమయంలో అమెరికా, ఇజ్రాయెల్ ప్రధాన లక్ష్యాల్లో ఈ వ్యవస్థ ఒకటిగా నిలిచింది.

# బాదంపప్పు బాగోతలు ఎపిసోడ్ -18

# వి.ఆర్‌ల వెనుక అసలు కథ ఏమిటి..?

- పోస్టింగ్‌ల రాజకీయాలపై కొత్త ప్రశ్నలు
- సాధారణ కుటుంబం నుంచి కీలక పోస్టింగ్‌ల దాకా...
- ఐదు సార్లు వి.ఆర్‌లోకి వెళ్లిన అధికారి కథ ఏమిటి?
- కర్త కర్మ క్రియగా మామ "జీ "
- అవినీతి బినామీగా ఉన్న సత్తిపండు ఎవరు..?
- పెనుమంట్ర - తాడేపల్లిగూడెం అనుబంధంపై ఎందుకంత చర్చ?
- స్థానికంగా ప్రచారంలో ఉన్న లావాదేవీల కథనాలేమిటి?
- రిజిస్టర్డ్ ఆస్తులపై వినిపిస్తున్న ప్రశ్నలు ఏమిటి?
- ఆరోపణలకు సమాధానాలు ఎప్పుడు వస్తాయి?

**ఒక సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చిన ఓ పోలీసు అధికారి ఉద్యోగ జీవితంలో పలుమార్లు వి.ఆర్‌లోకి వెళ్లడం, ఆ తర్వాత మళ్లీ కీలక పోస్టింగ్‌లు పొందడం ఇప్పుడు ఉమ్మడి గోదావరి జిల్లాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామాల వెనుక కేవలం పరిపాలనా కారణాలే ఉన్నాయా? లేక ప్రభావవంతమైన వ్యక్తుల పాత్ర కూడా ఉందా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామం నుంచి ప్రారంభమైన ప్రయాణం, జగ్గంపేటలో విద్యాభ్యాసం, అనంతరం పోలీసు శాఖలో ఉద్యోగం, వివిధ ప్రాంతాల్లో పోస్టింగ్‌లు, వి.ఆర్‌లు, తిరిగి కీలక కేంద్రాల్లో బాధ్యతలు- ఈ మొత్తం వ్యవహారంపై స్థానికంగా అనేక చర్చలు సాగుతున్నాయి.**

**ఇన్వెస్టిగేషన్ నెట్వర్క్ పెన్ పవర్ , తాడేపల్లిగూడెం జూన్ 14 :**

కుటుంబ నేపథ్యం గండేపల్లి మండలం ఉప్పలపాడు గ్రామం... తండ్రి పాలవ్యాపారం, తల్లి గృహిణి అని సమాచారం... ఒక సాధారణ కుటుంబంలో జన్మించిన బాదంపప్పు.. డిగ్రీ వరకు అప్పటి తూర్పుగోదావరి జిల్లా ప్రస్తుత కాకినాడ జిల్లా మండల కేంద్రమైన జగ్గంపేట లో పూర్తి చేశాడని సమాచారం.. సర్వీస్ లోకి చేరేటప్పటికి (సర్వీస్ రికార్డు ప్రకారం) బాదం పప్పు స్థిర చరస్తులు ఎంత..? ప్రస్తుత ప్రాపర్టీ ఎంతో తెలిస్తే ముక్కున వేలేసుకోవాల్సిందే... ? కర్త కర్మ క్రియగా మామ "జీ " వెనకుండి మన బాదంపప్పు ఆరోపణలు ఎదుర్కొని ఎప్పుడు దొరికిన... పై అధికారులను శాంతింపజేసీ అప్పటికి వి .ఆర్. కు పంపించుకోవడం, అనంతరం ఎమ్మెల్యేలకి రికమండేషన్ లెటర్ కోసం... ఎంతైనా వెచ్చించి బడా బాబుల్నే మీడియేటర్లు వాడి బాదం పప్పు కు మంచి సెంటర్ లోనే పోస్టింగు వేయించుకుంటాడని సమాచారం....

ఇకపోతే పెనుమంట్ర, తాడేపల్లిగూడెం లు మన బాదంపప్పుకు విడదీయరాని బంధం పెనవేసుకుంది... ఆ బంధం తెలియాలంటే పెనుమంట్ర మండలం ఆలమూరు గ్రామంలో సత్తిపండు ను టచ్ చేస్తే మొత్తం కథ తెలుస్తుందని, బాదంపప్పు కు సంబంధించిన ఏ లావాదేవీలు జరగాలన్న సత్తిపండు ఉండాల్సిందేనాని... బాదంపప్పు అవినీతి బినామీగా ఉన్న సత్తిపండు ప్రసిద్ధి చెందాడని సమాచారం... ఇప్పటికే పలుమార్లు స్టేషన్ కూడా వచ్చి వెళ్తుంటాడని ఆ స్టేషన్ కానిస్టేబుల్స్ అయిన త్రిమూర్తులు కూడా చెప్పుకోవడం కొసమెరుపు... ఆ కోణంలో తీగ లాగిన పెన్ పవర్ కు ఇప్పటికే రెండు ప్రాపర్టీస్ పెన్ పవర్ చేతికి చిక్కాయి... డొంక లాగే పనిలోనే ఉంది పెన్ పవర్ ఆ డొంక కదిలితే మిగతా అవినీతి చిట్టా అంతా బయటికి వస్తుంది..

**ఎపిసోడ్ 19లో**
**బాదంపప్పు గురించి మరిన్ని ఆసక్తి కథనాలు**
**ఆస్తులపై వినిపిస్తున్న ప్రశ్నలు...**
**పత్రాలు ఏమి చెబుతున్నాయి..?**

# ఫ్రాన్స్‌లో మోదీ పర్యటన.. మేక్రాన్‌తో కలిసి చారిత్రక 'విల్లా కెర్లియోస్' సందర్శన

- మొదటి పేజి తరువాయి

నేతలు తేలికపాటి సంభాషణలో మునిగిపోయారు. విల్లాను కలియతిరుగుతూ ఆత్మీయంగా మాట్లాడుకున్నారు.

విల్లా కెరిలోస్ అనేది 20వ శతాబ్దం ప్రారంభంలో నిర్మించిన ఒక అసాధారణమైన హౌస్ మ్యూజియం. క్రీస్తుపూర్వం 2వ శతాబ్దానికి చెందిన ఒక ప్రాచీన గ్రీకు ఉన్నత కుటుంబ నివాసాన్ని నమూనాగా తీసుకుని, ఎంతో నిశితంగా ఆధునిక కాలంలో దీన్ని పునఃసృష్టించారు. ఫ్రాన్స్‌లోని ఫ్రెంచ్ రివేరా తీరంలో, నైస్ మరియు మొనాకో నగరాల మధ్య ఉన్న బ్యూలీ-సర్-మెర్ అనే ప్రాంతంలో ఈ విల్లా ఉంది. మధ్యధరా సముద్రానికి అభిముఖంగా ఒక రాతి ద్వీపకల్పంపై కొలువై ఉన్న ఈ భవనం, ప్రస్తుతం చారిత్రక కట్టడంగా వర్గీకరించబడింది. దీని యాజమాన్య హక్కులను 'ఇన్‌స్టిట్యూట్ డి ఫ్రాన్స్' కలిగి ఉంది. అంతకుముందు, నీస్‌లో జరిగిన 'భారత్ ఇన్నోవేట్స్' కార్యక్రమాన్ని మోదీ, మేక్రాన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. భారత్‌లో సంస్కరణల వేగం తగ్గబోదని స్పష్టం చేశారు. దేశంలోని స్టార్టప్ వ్యవస్థ మరింత విస్తరణకు సిద్ధంగా ఉందన్నారు. గత 11-12 ఏళ్లలో బలమైన ఆవిష్కరణల వ్యవస్థను నిర్మించుకున్నామని, ప్రపంచంలోనే మూడో అతిపెద్ద స్టార్టప్ వ్యవస్థగా భారత్ అవతరించిందని గుర్తు చేశారు. ప్రపంచ సవాళ్లకు సాంకేతిక పరిష్కారాలు అభివృద్ధి చేసేందుకు తమతో కలిసి పనిచేయాలని ప్రపంచ ఆవిష్కర్తలను ఆయన ఆహ్వానించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ హాజరుకావడం ఫ్రాన్స్‌కు ఎంతో గౌరవకారణమని

అధ్యక్షుడు మేక్రాన్ అన్నారు. భారత నేతగా 12 ఏళ్లు పూర్తి చేసుకున్నందుకు మోదీని అభినందించారు. ఇరు దేశాల మధ్య సంబంధాలను

బలోపేతం చేయడంలో మోదీ పాత్రను ఆయన ప్రశంసించారు. అధ్యక్షుడు మేక్రాన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ శనివారం ఫ్రాన్స్ చేరుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు నేతలు ద్వైపాక్షిక సంబంధాలపై సమీక్ష జరపనున్నారు. ఈ కార్యక్రమానికి ముందు మోదీ పలువురు ఇన్వెస్టర్లు, వెంచర్ క్యాపిటల్ అధిపతులతో కూడా సమావేశమయ్యారు.

# మహారాష్ట్రలో ఘోర ప్రమాదం...

# పికప్ వ్యాన్ బావిలో పడి 8 మంది మృతి

- మొదటి పేజి తరువాయి

గుర్తించారు. వీరంతా మాల్వాడ్‌లోని ఆలయంలో దర్శనం పూర్తిచేసుకుని తిరిగి తమ స్వగ్రామానికి వెళుతుండగా మాల్వాడ్-పండరీపూర్ మార్గంలో ఈ విషాదం జరిగింది. తాండూల్వాడి సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బావిలోకి దూసుకెళ్లింది.ప్రమాదం జరిగిన బావికి ఎలాంటి రక్షణ గోడ లేకపోవడమే ఇంతటి ఘోరానికి ప్రధాన కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై ఎన్‌సీపీ (శరద్ పవార్) ఎమ్మెల్యే రోహిత్ పవార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే సహాయం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లా పర్యవేక్షక మంత్రి జయకుమార్ గోర్ మాట్లాడుతూ.. బావికి రక్షణ గోడ లేకపోవడంపై విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను పర్యవేక్షిస్తోంది.

# ఏపీకి వర్ష సూచన..

# పలు జిల్లాలకు హెచ్చరిక

దక్షిణ కోస్తాంధ్ర నుంచి తమిళనాడు వరకు అల్పపీడనం విస్తరించిందని, దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. సోమవారం పలు ప్రాంతాల్లో వర్షాలు పడతాయని ఆయన వెల్లడించారు.మన్యం, అల్లూరి, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, నంద్యాల, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడా ఉరుములతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొన్నారు.

అదేవిధంగా శ్రీకాకుళం, పోలవరం, అనకాపల్లి, కాకినాడ, కోనసీమ, గుంటూరు, బాపట్ల, చిత్తూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ఉరుములతో కూడిన తేలికపాటి జల్లులు పడే అవకాశం ఉందని వివరించారు.

వర్షాలు, పిడుగులతో కూడిన ఉరుముల సమయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. చెట్ల కింద, భారీ హోర్డింగుల సమీపంలో నిలబడటం సురక్షితం కాదని హెచ్చరించారు.

# గోదావరి-బనకచర్ల ప్రాజెక్టుకు మద్దతు..

# సీఎం చంద్రబాబుకు రిటైర్డ్ ఇంజనీర్ల లేఖ

గోదావరి నది వరద జలాలపై దిగువ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి హక్కులు ఉన్నాయని, ఆ నీటిని వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన గోదావరి-బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు సమర్థనీయమని ఏపీ జలవనరుల శాఖ విశ్రాంత ఇంజనీర్ల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సంఘం అధ్యక్షుడు ఎం.విశ్వేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి నరసింహమూర్తి నిన్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు లేఖ రాశారు. గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ (GWDT) 1978లో వెలువరించిన తీర్పును వారు తమ లేఖలో ప్రస్తావించారు. ఎగువ రాష్ట్రాలకు ప్రాజెక్టుల వారీగా కేటాయింపులు పోగా, దిగువకు ప్రవహించే మిగులు వరద జలాలను వాడుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌కు సంపూర్ణ స్వేచ్ఛ ఉందని వారు తెలిపారు. అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదాల చట్టం-1956 ప్రకారం, ఈ మిగులు జలాల వినియోగంపై కేంద్ర ప్రభుత్వం గానీ, ఎగువ రాష్ట్రాలు గానీ అభ్యంతరం తెలిపే అధికారం లేదని వారు తేల్చిచెప్పారు.

గోదావరి-బనకచర్ల అనుసంధాన పథకం ద్వారా వరద నీటిని బొల్లపల్లి రిజర్వాయర్‌లో నిల్వ చేసి, కరవు పీడిత ప్రాంతాలైన కర్నూలు, కడప, ప్రకాశం జిల్లాలకు 75 శాతానికి పైగా సాగునీటి భరోసా కల్పించవచ్చని సంఘం వివరించింది. ఈ ప్రాజెక్టు రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో వ్యవసాయం, తాగునీటి అవసరాలను తీర్చి, రాష్ట్ర ఆర్థిక స్థిరత్వానికి ఎంతో దోహదపడుతుందని పేర్కొంది.గోదావరి జలాల పంపకాలపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య చర్చలు, న్యాయపరమైన అంశాలు నడుస్తున్న తరుణంలో విశ్రాంత ఇంజనీర్ల సంఘం చేసిన ఈ ప్రకటన అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది.

# మా ఫేస్‌బుక్ పేజీని బ్లాక్ చేశారు...

# కూటమి ప్రభుత్వంపై జగన్ ఆగ్రహం

- మొదటి పేజి తరువాయి

చర్యలకు దిగుతోందని జగన్ ఆరోపించారు. ప్రభుత్వ అప్రజాస్వామిక చర్యలపై న్యాయపరంగా, రాజ్యాంగబద్ధంగా పోరాడతామని ఆయన స్పష్టం చేశారు. బెదిరింపులు, సెన్సార్‌షిప్‌తో తమ గొంతును అణచివేయలేరని, ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పారు.ప్రజాస్వామ్య స్ఫూర్తిని కాపాడేందుకు, తమ ఫేస్‌బుక్ పేజీని తక్షణమే పునరుద్ధరించాలని జగన్ డిమాండ్ చేశారు.

## పల్నాడు జిల్లాలో విషాద ఘటన...

## కృష్ణా నదిలో పడవ బోల్తా పడి నలుగురి మృతి

- మొదటి పేజి తరువాయి

మిగిలిన నలుగురు గల్లంతు కాగా, సమాచారం అందుకున్న రెస్క్యూ బృందాలు ఘటనా స్థలానికి చేరుకున్నాయి. గాలింపు చర్యల్లో నలుగురి మృతదేహాలను వెలికితీశారు. ఈ ఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు.

# ఏడేళ్లకే కోడింగ్ లో దిట్ట...

# 16 ఏళ్లకే రూ.100 కోట్ల స్టార్టప్.. ఎవరీ ప్రాంజలి అవస్తి?

పెన్ పవర్ డెస్క్:అమెరికాలో భారత సంతతికి చెందిన ఓ యువతి చిన్న వయసులోనే అద్భుతం సృష్టించింది. కేవలం 16 ఏళ్ల వయసులో 'డెల్వ్.ఏఐ' పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ స్టార్టప్‌ను ప్రారంభించిన ప్రాంజలి అవస్థి, ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వార్తల్లో నిలుస్తోంది. ఆమె స్థాపించిన కంపెనీ విలువ దాదాపు రూ. 100 కోట్లకు (12 మిలియన్ డాలర్లు) చేరడంతో ఆమె సక్సెస్ స్టోరీ సోషల్ మీడియాలో మరోసారి వైరల్ అవుతోంది.భారత్‌లో జన్మించిన ప్రాంజలి, చిన్నతనంలోనే తన కుటుంబంతో కలిసి ఫ్లోరిడాకు వలస వెళ్లింది. ఆమె తండ్రి ఇంజినీర్ కావడంతో, ఆయన స్ఫూర్తితో 7 ఏళ్లకే కోడింగ్ నేర్చుకోవడం ప్రారంభించింది. 13 ఏళ్ల వయసులో మెషిన్ లెర్నింగ్‌పై ఓ రీసెర్చ్ ఇంటర్న్‌షిప్‌లో పాల్గొంది. ఆ సమయంలో ఆన్‌లైన్‌లో ఉన్న భారీ సమాచారాన్ని విశ్లేషించడంలో పరిశోధకులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గమనించింది.ఈ సమస్యకు పరిష్కారంగా, 2022 జనవరిలో, తన 16వ ఏట డెల్వ్.ఏఐని ప్రారంభించింది. ఆన్‌లైన్ సమాచారం, అకడమిక్ పేపర్లు, పీడీఎఫ్‌ల నుంచి కీలక విషయాలను వేగంగా వెలికితీసి, క్రమపద్ధతిలో అందించడమే ఈ ఏఐ టూల్ ప్రత్యేకత. మయామికి చెందిన ఓ స్టార్టప్ యాక్సిలరేటర్‌లో చేరడంతో ఆమెకు పెట్టుబడిదారులతో సంబంధాలు ఏర్పడ్డాయి. దీని ద్వారా ఆన్ డెక్, విలేజ్ గ్లోబల్ వంటి సంస్థల నుంచి సుమారు 450,000 డాలర్లు(దాదాపు రూ. 3.7 కోట్లు) నిధులను సమీకరించింది.గత కొన్ని రోజులుగా ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికలపై ఆమె విజయగాథ మళ్లీ ట్రెండ్ అవుతోంది. జార్జియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో కంప్యూటర్ సైన్స్ చదివిన ప్రాంజలి, ప్రస్తుతం ఇతర టెక్ ప్రాజెక్టులతోనూ చురుకుగా ఉన్నట్లు తెలుస్తోంది.

# ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం



**వై రామవరం,పెన్ పవర్, జూన్ 14:** పాఠశాలల పునః ప్రారంభం నాటికి భవన నిర్మాణాలు పూర్తి చేసి ఇవ్వాలనే ప్రభుత్వఆదేశాలను ఇంజనీరింగ్ అధికారులు నిర్లక్ష్యం, కాంట్రాక్టర్ల అలసత్వం కారణంగానే నేటికీ భవన నిర్మాణాలు పూర్తి కాలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సర్వ శిక్ష అభియాన్ ద్వారా మంజూరైన భవన నిర్మాణాలు నత్త నడకన నడుస్తున్నాయని స్థానికుల ఆరోపిస్తున్నారు. గత విద్యా సంవత్సరం లోనే ప్రారంభించిన భవన నిర్మాణాలు నేటికీ పూర్తికాలేదని అంటున్నారు. మండలంలో పనసల పాలెం,దాలిపాడు, మంగంపాడు ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన భవనాలు అసంపూర్తిగా ఉన్నాయని ఉపాధ్యాయులు అంటున్నారు. విద్యార్థులకు సరిపడా వసతి సౌకర్యాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అంటున్నారు. కోట్లాది రూపాయలతో నిర్మించ తలపెట్టిన ఈ భవన నిర్మాణాలు ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే, కాంట్రాక్టర్లు అలసత్వం వహించి సకాలంలో పూర్తి చేయడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పాఠశాలల పునః ప్రారంభం నాటికే భవనాలు అందుబాటులోకి వస్తాయని ప్రభుత్వఅధికారులు తెలియజేసిన నేటికీ భవనాలు పూర్తి కాలేదని అంటున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి భవన నిర్మాణాలు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుచున్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

## జిల్లా, విభాగ, మండల కేంద్రాలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**



**పెన్ పవర్ భీమవరం: జూన్ 14:**జిల్లా ప్రజల సమస్యలను వేగవంతంగా పరిష్కరించేందుకు ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం జూన్ 15న జిల్లా కలెక్టరేట్‌తో పాటు అన్ని విభాగ, మండల కేంద్రాలలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

అదేవిధంగా భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలను అవసరమైన ఆధార పత్రాలతో సమర్పించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

వినతిపత్రాల స్వీకరణ, పరిశీలన, పరిష్కార ప్రక్రియలను మరింత పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా, మండల స్థాయి అధికారుల సమన్వయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రజలు తమ ఫిర్యాదులను "మీకోసం" అంతర్జాల వేదిక ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చని చెప్పారు. వినతిపత్రాల స్థితి, పరిష్కార ప్రక్రియ లేదా ఇతర వివరాల కోసం "మీకోసం" ఉచిత సహాయవాణి సంఖ్య 1100ను సంప్రదించవచ్చని సూచించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు హాజరయ్యే ప్రజల కోసం తాగునీరు, అల్పాహారం, భోజనం వంటి సౌకర్యాలతో పాటు దివ్యాంగులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

అందిన వినతిపత్రాలపై నిరంతర పర్యవేక్షణ చేపట్టి, సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు.

అదేవిధంగా ప్రతి శుక్రవారం నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదికలను కూడా ప్రజలు వినియోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కలెక్టర్ కోరారు.

# నేడు యథావిధిగా పీజీఆర్ఎస్, రెవెన్యూ క్లినిక్ నిర్వహణ

**1100 టోల్ ఫ్రీ నంబర్, మీకోసం పోర్టల్, వాట్సాప్ గవర్నెన్స్ సేవలను వినియోగించుకోవాలి**

**జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్**



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ జూన్ 14 :** పోలవరం జిల్లా పరిధిలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్-గ్రీవెన్స్) మరియు రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలు సోమవారం (జూన్ 15) ఉదయం 10.30 గంటలకు రంపచోడవరం ఐటీడీఏ సమావేశ మందిరంలో యథావిధిగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని వివిధ శాఖలకు చెందిన అధికారుల సమక్షంలో రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడతామని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో అన్ని మండలాల తహశీల్దార్లు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఈ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.ప్రజలు తమ సమస్యలు, ఫిర్యాదులను నేరుగా అధికారులకు సమర్పించి పరిష్కారం పొందేందుకు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు మరింత చేరువగా సేవలు అందించాలనే లక్ష్యంతో మండల స్థాయిలో కూడా గ్రీవెన్స్ డే, రెవెన్యూ క్లినిక్ కార్యక్రమాలను నిర్వహిస్తూ విస్తృత ప్రచారం చేపడుతున్నట్లు తెలిపారు.అలాగే ప్రజలు తమ ఫిర్యాదులను 'మీకోసం' పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని, నమోదు చేసిన అర్జీల స్థితిగతులు తెలుసుకోవడానికి 1100 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న వాట్సాప్ గవర్నెన్స్ సేవలు కూడా ప్రజలకు అందుబాటులో ఉన్నాయని, 9552300009 నంబర్‌కు తమ ఫిర్యాదులను పంపించవచ్చని తెలిపారు. అందిన ఫిర్యాదులపై సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని కలెక్టర్ కె. దినేష్ కుమార్ స్పష్టం చేశారు.

# నేటి నుంచి ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రారంభం

- పోలవరం నియోజకవర్గంలో 399 పోలింగ్ కేంద్రాల్లో ఇంటింటి సర్వే
- 72.43 శాతం ఓటర్ల మ్యాపింగ్ పూర్తి -- ప్రజలు, రాజకీయ పార్టీలు సహకరించాలి



**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, జూన్ 14 :** భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పోలవరం అసెంబ్లీ నియోజకవర్గంలో ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్-2026) జూన్ 15 నుంచి ప్రారంభం కానున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా ఖచ్చితత్వం, పారదర్శకత, సమగ్రతను మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ప్రస్తుతం అమలులో ఉన్న 2025 ఓటర్ల జాబితాను 2002 ప్రత్యేక సమగ్ర సవరణ ఓటర్ల జాబితాతో అనుసంధానం చేస్తూ క్షేత్రస్థాయిలో విస్తృత సర్వే చేపట్టనున్నట్లు తెలిపారు.పోలవరం నియోజకవర్గంలోని మొత్తం 399 పోలింగ్ కేంద్రాల పరిధిలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ చేపడతారని చెప్పారు. నియోజకవర్గంలో మొత్తం 2,78,518 మంది ఓటర్లు ఉండగా, జూన్ 5 నుంచి 14 వరకు నిర్వహించిన మ్యాపింగ్ కార్యక్రమంలో 2,01,730 మంది ఓటర్ల వివరాలను ధృవీకరించడం ద్వారా 72.43 శాతం పురోగతి సాధించినట్లు వెల్లడించారు.జూన్ 15 నుంచి జూలై 14 వరకు నిర్వహించే ఇంటింటి సర్వేలో బీఎల్‌వోలు ప్రతి ఓటరును నేరుగా కలుసుకుని ఎన్యూమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు ఫారాలను పూర్తిగా నింపి రెండు పాస్‌పోర్టు సైజు రంగు ఫోటోలతో సంబంధిత బీఎల్‌వోలకు సమర్పించాలని సూచించారు.జూలై 1, 2026 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువత ఫారం-6 ద్వారా ఓటరుగా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. అలాగే ఓటర్ల జాబితా నుంచి పేరు తొలగింపులకు ఫారం-7, వివరాల మార్పులు లేదా సవరణల కోసం ఫారం-8 సమర్పించాలని సూచించారు.జూలై 21న ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురించబడుతుందని, అదే రోజు నుంచి ఆగస్టు 20 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరిస్తామని తెలిపారు. అనంతరం దరఖాస్తులను పరిశీలించి సెప్టెంబర్ 22న తుది ఓటర్ల జాబితా ప్రచురించనున్నట్లు వెల్లడించారు.2011 జనాభా గణాంకాల ఆధారంగా ఉన్న ఎన్నికల నిర్వహణ వ్యవస్థను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా హేతుబద్ధీకరించడం, అర్హులైన ప్రతి పౌరుడిని ఓటరుగా నమోదు చేయడం, అనర్హ నమోదులను గుర్తించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ వివరించారు. పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణకు సంబంధించి ఎన్నికల సంఘం నిర్దేశించిన ప్రమాణాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిపారు.ఓటర్ల సహాయార్థం ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నంబర్ 1950 అందుబాటులో ఉందని, పేరు నమోదు, చిరునామా మార్పు, వివరాల సవరణ, ఓటరు జాబితాలో పేర్ల ధృవీకరణ, ఫిర్యాదులు, అభ్యంతరాలకు సంబంధించి ఈ సేవలను వినియోగించుకోవాలని సూచించారు.బూత్ స్థాయి ఏజెంట్లు, బీఎల్‌వోలు, ఎన్నికల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, సామాజిక సంస్థలు, అర్హులైన ఓటర్లు సమన్వయంతో పనిచేసి పారదర్శకమైన, ఖచ్చితమైన, సమగ్ర ఓటర్ల జాబితా తయారీకి సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె. దినేష్ కుమార్ విజ్ఞప్తి చేశారు.

## భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో జూన్ 19న రాష్ట్రస్థాయి అంశాధారిత యోగా ప్రదర్శన కార్యక్రమం




**జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి**

**పెన్ పవర్ భీమవరం: జూన్ 14**

అంతర్జాతీయ యోగా దినోత్సవం--2026 సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న "యోగాంధ్ర--2026" కార్యక్రమంలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లాలో రాష్ట్రస్థాయి అంశాధారిత యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని ఈ నెల 19న భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు.

యోగాను ప్రజల దైనందిన జీవితంలో భాగంగా మార్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా "యోగాంధ్ర--2026" కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ స్థాయిల్లో అవగాహన కార్యక్రమాలు, యోగా శిక్షణ శిబిరాలు, ప్రదర్శనలు చేపడుతున్నట్లు తెలిపారు. విస్తృత ప్రజాభాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని ప్రభుత్వం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తోందని చెప్పారు.

ఈ నేపథ్యంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో క్రీడాకారుల కోసం ప్రత్యేక రాష్ట్రస్థాయి అంశాధారిత యోగా ప్రదర్శన కార్యక్రమాన్ని జూన్ 19న ఉదయం 6.30 గంటల నుంచి 8.00 గంటల వరకు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి క్రీడాకారులు, యోగా శిక్షకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువత, క్రీడా శాఖ అధికారులు పాల్గొననున్నారని తెలిపారు. యోగా ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, క్రమశిక్షణ పెంపొందుతాయని, ముఖ్యంగా క్రీడాకారుల ప్రతిభాభివృద్ధికి యోగా ఎంతగానో దోహదపడుతుందని ఆమె పేర్కొన్నారు.

కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు ఇప్పటికే ఆదేశాలు జారీ చేసినట్లు కలెక్టర్ తెలిపారు. పాల్గొనే వారికి తాగునీరు, పారిశుధ్య సౌకర్యాలు, వైద్య సేవలు, భద్రతా ఏర్పాట్లు, ఇతర మౌలిక సదుపాయాలను అందుబాటులో ఉంచనున్నట్లు చెప్పారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యోగా ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి పిలుపునిచ్చారు.



# కేశవరాయుడు పాలెం..పమస్యల మేట





**ఏలూరు జూన్ 14 పెన్‌పవర్ :** దెందులూరు నియోజక వర్గంలోని మండల కేంద్రం పెదపాడు పంచాయితీ పరిధిలోని కేశవరాయుడు పాలెం కాలనీలలో అవస్దల జాడలు కనిసిస్తున్నాయి. మురుగు కాల్వలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.బయటికి వెళ్లాలంటే మురుగులో నడవాల్సిందే.రోడ్ల వెంబడి చెత్తా చెదారాలతో అపరిశుభ్ర వాతావరణం నెల కొని ఉంది.కాలనీలలో డ్రైయినేజీలు లేక మురుగు కాలనీ రోడ్లపై మురుగు ప్రవహిస్తోంది.వర్షం వస్తే రోడ్లన్నీ మురుగునీటితో బురదగా మారి నడవడానికి ప్రజలు అవస్దలు పడుతున్నారు.రోడ్లపై చెత్తా చెదారాలు వేయడంతో అంగన్ వాడీ కేంద్రం వద్ద మురుగు వెళ్లే దారి లేక,రోడ్‌పైకి చేరుతొంది.ఇళ్లముందు ఆక్రమణలతో కాలువలు కుచించుకు పోయి మురుగు మందుకు కదలడంలేదు.వ్యర్దాలను తొలగించక పోవడంతో అనారోగ్కం బారిన పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు.

**రోడ్లవెంబడి చెత్తాచెదాలు పారబోస్తున్నారు**

చెత్తా చెదారాలను పంపోస్ట్ యార్డుకు తరలించకుండా రామచంద్రాపురం నుండి వీరమ్మకుంట వెళ్లే ప్రధాన రహదారి వెంబడి వేస్తున్నారు.దుర్వాసనతో గాలికి ఎగిరి వాహనదారులు,ప్రయాణీకులు ఇబ్బందులు కలిగిస్తున్నాయని పేర్కోంటున్నారు.పారిశుధ్ధకార్మికులు రోడ్ల వెంబడి ఉన్న చెత్తను తగులబెడుతున్నారు.పర్యవేక్షణాధికారులు పరిశీలించి తమ సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

**గ్రామాల్లో కనిపించని స్వచ్ఛభారత్ మిషన్ పర్యవేక్షకులు**

పల్లేల్లో పారిశుధ్యం,ఇతర సర్వేలను పర్యవేక్షించాల్సిన స్వచ్ఛభారత్ మిషన్ పర్యవేక్షలు గ్రామాల్లో విధులు నిర్వహించడం లేదు.వీరు మొక్కుబడిగా మండల పరిషత్ కార్యాలయాల్లో అధికారులకు కనిపించి వెళ్లిపోతున్నారు.గతంలో వీరు సాక్షర భారత్ మండల కోఆర్డినేటర్లుగా పనిచేసేవారు.నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చి దిద్దేందుకు నియమితులయ్యారు.వైకాపా ప్రభుత్వం వచ్చాక వీరిని తొలగించారు.కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 సెప్టెంబర్‌లో మళ్లీ స్వచ్ఛభారత్ మిషన్ పర్యవేక్షకులుగా మండలానికొకరిని నియమించారు.

**పర్యవేక్షణ ఎక్కడా..?**

మండల పరిషత్తు పరిధిలో గ్రామాల్లో పారిశుధ్య పరిస్దితులు,ప్రభుత్వం చేపడుతున్న వివిధ సర్వేలకు సంబంధించి కార్యదర్శులతో పాటు స్వచ్ఛభారత్ మిషన్ పర్యవేక్షకులు ఉండాల్సి ఉంది.సర్వే ఏవిధంగా జరుగుతుంది.ఇతర అంశాలను పర్యవేక్షించాలి. అయితే స్వచ్ఛభారత్ మిషన్ పర్యవేక్షకులు కనీసం పారిశుధ్యం అధ్వానంగా ఉన్న ప్రాంతాల్లో కూడా తిరిగిన దాఖలాలు లేవు.కేవలం వేతనాలు తీసుకోవడానికి అధికారులను ప్రసన్నం చేసుకుంటున్నారు తప్పా పనిచేయడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## వాకిట ఇంటి దగ్గర..కాయగూరలు అంగట్లోంచి



**ఏలూరు జూన్ 14 పెన్‌పవర్ :** మాతా శిశు సంరక్షణ ప్రాజెక్టు పెదపాడు సెక్టార్ సెంటర్ నెం.14 కు చెందిన పోషణ్ వాటిక అంగన్ వాడీ కేంద్రంలో కాకుండా నిర్వాహకులు ఇంటి వద్దనే ఏర్పాటు చేసుకోవడం విమర్శలకు తావిస్తోంది.పొంత భవనాలు కలిగిన అంగన్ కేంద్రాలకు ఐసిడిఎస్ అదికారులు పోషణ్ వాటిక నిర్వాహణకురూ. 10వేలు మంజూరు చేసింది.అంగన్‌వాడీచిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు, పౌష్టికాహారం అందించాలనే లక్ష్యంతో ఆ శాఖ అధికారులు వీటిని ఏర్పాలు చేసి నిర్వహణ బాద్యతను అంగన్ వాడీ కార్యకర్తలకు,అంగన్ వాడీ సెంటర్ నిర్వాహకులకు అప్పగించింది




**విస్తీర్ణం సమస్య**

కేంద్రంలో అన్నీ సదుపాయాలు ఉన్నా పోషన్ వాటికను ఇంటిదగ్గర నిర్వహించడం ,వాటిక నిర్వహణ ఎలా ఉంది అనే విషయం పర్యవేక్షణ అధికారులు పక్కన పెడితే,వాటికలో పండిన కాయగూరలు లబ్దిదారులకు అందడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి.అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఉన్నా భవనానికి సరిహద్దులు లేక పోవడంతో రక్షణ గోడ ఏర్పాటు చేయలేదు.దీంతో అంగన్ వాడీ కేంద్రానికి ఎంత స్దలం ఉందో నిర్వాహకులకు తెలియని పరిస్దితి.కేంద్రం ముందు విశాలమైన స్దలం ఉండడం,ఆస్తలంలో ఫంక్షన్‌లు,ఇతరత్రా కార్యక్రమాలు చేస్తుండటంతో కేంద్రం నిర్వహణ సమయంలో శబ్దాలు,ఇతర కార్యక్రమాల వల్ల ఆటంకాలు ఏర్పడుతోంనే విమర్శలు వినిపిస్తున్నాయి.కేంద్రాని హద్దులు నిర్ణయించి రక్షణ గోడ ఏర్పాటుచేయాని లబ్దిదారులు,చిన్నారుల తల్లి తండ్రులు కోరుతున్నారు



**నిర్వహణ లోపం**

కేంద్రానికి సరఫరా చేస్తున్న కోడిగుడ్లు నాసిరకంగానూ,బరువు తక్కువగానూ ఉన్నా వాటిని నిర్వాహకులు చిన్నారులకు వండి పెడుతున్నారు.కేంద్రంలో వాటర్‌ప్యూరీ ఫైయర్ ఉన్నా చిన్నారులకు ప్యూరి ఫైయర్ లో రక్షిత తాగు నీరు సరఫరా జరుగడం లేదనే విమర్శలు వ్యక్తమౌతున్నాయి.పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకుని వాటికకు సరిహద్దులు ఏర్పాటు చేసి రక్షణ గోడ నిర్మించి,పోషణ్ వాటిక అంగన్ వాడీ కేంద్రం వాకిట ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

## రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో భారీ ఉచిత వైద్య శిబిరం







- **500 మందికి వైద్య సేవలు**
- **120 మందికి కంటి పరీక్షలు**
- **సేవా భావాన్ని అలవర్చుకోవాలని స్వామి పరిజ్ఞేయానందజీ పిలుపు**

**గంగవరం/ రంపచోడవరం పెన్ పవర్, జూన్ 14 :**రాజమండ్రికి చెందిన రామకృష్ణ మిషన్ గిరిజన సంచార వైద్యశాల ఆధ్వర్యంలో ఆదివారం సిరిగిందలపాడులోని రామకృష్ణ మిషన్ ప్రాంగణంలో ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. ఈ శిబిరాన్ని రామకృష్ణ మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయానందజీ మహారాజ్ పరిశీలించి వైద్య సేవల ఏర్పాట్లను సమీక్షించారు.ఈ సందర్భంగా స్వామి పరిజ్ఞేయానందజీ మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, స్వామి వివేకానంద బోధనల స్ఫూర్తితో సమాజ సేవకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. “మానవ సేవే మాధవ సేవ” అనే భావనను ఆచరణలో పెట్టి సేవాగుణాన్ని అలవర్చుకోవాలని ఆయన సూచించారు.వైద్య శిబిరంలో ప్రముఖ వైద్యులు డా. గోలి వెంకట రామారావు, డా. వల్లేపల్లి రామకృష్ణ, డా. శ్రీకృష్ణ పాతూరి, డా. రాయుడు శ్రీనివాస్, జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన డా. పావని ప్రియతో పాటు వివిధ విభాగాలకు చెందిన ఐదుగురు వైద్య నిపుణులు పాల్గొని సుమారు 500 మందికి వైద్య సేవలు అందించారు.రోగుల అవసరాలకు అనుగుణంగా 125 మందికి రక్త పరీక్షలు, 12 మందికి ఈసీజీ పరీక్షలు, 13 మందికి థైరాయిడ్ పరీక్షలు, 19 మందికి ఎక్స్‌రేలు, 17 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.అలాగే వేమగిరికి చెందిన పరమహంస యోగానంద నేత్రాలయం సహకారంతో ప్రత్యేక నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఇందులో 120 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, 38 మందికి ఉచితంగా కళ్లజోళ్లు పంపిణీ చేశారు. కంటి శస్త్రచికిత్స అవసరమైన 9 మంది రోగులను వేమగిరి పరమహంస యోగానంద నేత్రాలయానికి తరలించారు.వైద్య శిబిరానికి హాజరైన రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వహించినట్లు స్వామి పరిజ్ఞేయానందజీ తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరవేసేందుకు రామకృష్ణ మిషన్ నిరంతరం కృషి చేస్తోందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పరమహంస యోగానంద నేత్రాలయం ప్రోగ్రామ్ మేనేజర్ నక్కా చంటిబాబు, వాలంటీర్లు గిరిరాజ్ కృష్ణ వేగేశ్న, వాసురాజు, సత్యప్రసాద్, రాము, మంగిరెడ్డి, బగీరథరాజు, అశోక్, చంద్రరావు, రామకృష్ణ మిషన్ మెడికల్ క్యాంప్ కోఆర్డినేటర్ కానుమోను శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## నిరుపయోగంగా జిసిసి డిపో



**జీలుగుమిల్లి ,పెన్ పవర్ ,జూన్ 14** ; గిరిజన సహకార సంస్థ నుండి ప్రజలకు నిత్యవసర సరుకులు అందేవి. అయితే రాను రాను బియ్యం పంచదారకే పరిమితం అయింది. 1983 సంవత్సరంలో జీలుగుమిల్లిలో జిసిసి డిపో ఏర్పాటు చేశారు. బియ్యం, కిరోసిన్, గోధుమలు, కందిపప్పు, దుప్పట్లు, తేనె, చింతపండు ,ఉల్లిపాయలు ఇంకా అనేక నిత్యవసర సరుకులు పంపిణీ చేసేవారు. జీలుగుమిల్లి, తాటి యాకులగూడెం, పి రాజవరం, బర్రింకలపాడు గ్రామాల నుండి ప్రజలు వచ్చి లబ్ధిదారులు సరుకులు తీసుకుని వెళ్లేవారు. అయితే 20 10 సంవత్సరం నుండి ఆ భవనం శిథిలవాస్తకు చేరడంతో ఉపయోగించడం మాని వేయడం జరిగింది. సుమారు 16 సంవత్సరాల నుండి ఇప్పటివరకు ఆ భవనం నిరూపియోగంగా ఉంటుంది. భవనం సమీపంలో చెత్తాచెదారం వేయడంతో అపరిశుభ్రత నెలకొని ఉంది. ఆ సాంఘిక కార్యక్రమాలకు, విష సర్పాలు కు నిలయంగా మారింది. శిథిలా వ్యవస్థకు చేరుకోవడంతో జిసిసి అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా మండల కేంద్రంలోని ఈ భవనాన్ని మరల పునర్నిర్మించి అందుబాటులో తేవాలని ప్రజలు కోరుతున్నారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై భాజపా బీఎల్‌ఏలకు కార్యశాల





**పెన్ పవర్ ఉంగుటూరు, జూన్ 14:**స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గ బీఎల్ఏ-2ల కోసం ఆదివారం కైకరం గ్రామంలోని వనచర్ల కళ్యాణ మండపంలో కార్యశాల నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ఏలూరు జిల్లా భాజపా అధ్యక్షుడు విక్రమ్ కిషోర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చక్రవర్తి వర్మ, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యురాలు అడపా శోభారాణి, ఎస్ఐఆర్ జిల్లా కన్వీనర్ నగరపాటి సత్యనారాయణ, నియోజకవర్గ కన్వీనర్ వెంకటేశ్వరరావు, ఉంగుటూరు అసెంబ్లీ బీఎల్ఏ-1, బీఎల్ఏ-2లుగా నియమితులైన వారు హాజరయ్యారు.

కార్యశాలలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌ను ఎలా నిర్వహించాలి, బీఎల్ఏల విధులు, బాధ్యతలు ఏమిటి అనే అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో భీమడోలు మండలానికి చెందిన ప్రవీణ్ కుమార్ పటేల్, తవ్వా చిన్నబాబు, శ్రీనివాస్ శాస్త్రి, చీమల చిన్నారావుతో పాటు భాజపా నాయకులు పాల్గొన్నారు.

## నేర ప్రవృత్తిని మాని సత్ప్రవర్తనతో మెలగండి :- రౌడీ షీటర్లకు ఎస్సై ఎల్ . శ్రీను కౌన్సిలింగ్




**సీతానగరం, పెన్ పవర్, :14జూన్:**జిల్లాలో శాంతి భద్రతలను కాపాడటం నేరాలను పూర్తిగా అరికట్టడం లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు చేపడుతుంది. తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ డి. నరసింహ కిషోర్ ఆదేశాల మేరకు నార్త్ జోన్ డిఎస్పి జీవన కోరుకొండ సిఐ మూర్తి యొక్క సూచనలతో సీతానగరం మండలంలోని ఆదివారం సీతానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీ షీటర్లు నేర చరిత్ర గల వ్యక్తులు సస్పెక్ట్ షీటర్లకు విస్తృతంగా కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ నేర ప్రవర్తనను వెంటనే విడనాడి సత్ర్పవర్తనతో జీవనం సాగించాలని సూచించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పోలీసుల ఆదేశాలను ఉల్లంఘించి ప్రజాశాంతి భద్రతలకు భంగం కలిగించే ప్రయత్నం చేస్తే ఇప్పటికే ఉన్న కేసులకు అదనంగా మరిన్ని క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి వస్తుంది అని వారు హెచ్చరించారు. రౌడీ షీటర్లు పాత నేరస్తులు కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని ప్రతి అనుమానస్పద చర్యను సమీక్షిస్తున్నట్లు ఎస్సై ఎల్. శ్రీను తెలిపారు.

# ఓటరు జాబితా సవరణలో పార్టీ శ్రేణులు చురుగ్గా పాల్గొనాలి

* వైఎస్ఆర్‌సీపీ మండల నేతల పిలుపు



**గంగవరం, పెన్ పవర్ జూన్ 14:** మండలంలో చేపడుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు చురుగ్గా పాల్గొని అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయించేందుకు కృషి చేయాలని పార్టీ మండల నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం గంగవరం మండల వైఎస్ఆర్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బూత్ లెవల్ కమిటీ సభ్యులు, మండలంలోని వివిధ అనుబంధ విభాగాల అధ్యక్షులకు పార్టీ నాయకులు దిశానిర్దేశం చేశారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తయిన ప్రతి యువకుడు, యువతి తప్పనిసరిగా ఓటరుగా నమోదు అయ్యేలా అవగాహన కల్పించాలని కోరారు. అలాగే గ్రామాల్లో జరుగుతున్న ఓటరు నమోదు, పేర్ల చేర్పులు, తొలగింపులు, మార్పులను పార్టీ కార్యకర్తలు నిశితంగా పరిశీలించాలని సూచించారు. ఓటరు జాబితాలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని పేర్కొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేర్లు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవడం పార్టీ కార్యకర్తల బాధ్యతగా భావించాలని నాయకులు తెలిపారు. గ్రామ స్థాయిలో పార్టీ కమిటీలు సమన్వయంతో పనిచేసి ఓటరు నమోదు ప్రక్రియను విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో వైఎస్ఆర్‌సీపీ మండల అధ్యక్షుడు యజ్జు వెంకటేశ్వరావు, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు కేఎస్ ప్రభాకర్, మండల యువజన విభాగం అధ్యక్షుడు సతీష్, ఉపాధ్యక్షుడు మేడిశెట్టి శ్రీను, ప్రచార కమిటీ అధ్యక్షుడు ఎస్. కామరాజు, సోషల్ మీడియా కన్వీనర్ తలారి ప్రభ, వాణిజ్య విభాగం అధ్యక్షుడు పి. బాబ్జి, మాజీ సర్పంచ్ పాయం వెంకటేశ్వర్లు, కృష్ణకుమారి, తలారి పాపారావు, జగదీష్ బొట్ట, వీరబాబు, బండి చిన్న నూకరాజు, రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

# హెల్మెట్ వాడకం తప్పనిసరి

* ఏఎస్పీ హేమంత్ కుమార్




**చింతూరు, పెన్ పవర్, జూన్ 14:** ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, హెల్మెట్ వినియోగం ద్వారా సుమారు 90 శాతం వరకు ప్రమాద మరణాలను నివారించవచ్చని చింతూరు ఏఎస్పీ హేమంత్ కుమార్ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ అమిత్ బర్దార్ ఆదేశాల మేరకు ఆదివారం ఎర్రంపేట గ్రామంలో నిర్వహించిన రోడ్డు భద్రత, నేరాల నివారణ అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరికి మించి ప్రయాణించరాదని, వాహనదారులు తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు సక్రమంగా ఉంచుకోవాలని సూచించారు. అధిక వేగంతో వాహనాలు నడిపే వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇచ్చే తల్లిదండ్రులపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి సేవించడం, విక్రయించడం లేదా వ్యాపారానికి సహకరించడం చట్టరీత్యా నేరమని తెలిపారు. మత్తు పదార్థాల అక్రమ వ్యాపారంలో పాల్గొనే వారి ఆస్తులను ప్రభుత్వం జప్తు చేసే అవకాశం ఉందని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడం నిషేధమని, అలాంటి వారిని డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లత శ్రీ మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న వేధింపులు, మొబైల్ ఫోన్‌ల ద్వారా జరుగుతున్న సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈవ్‌టీజింగ్ వంటి ఘటనలు ఎదురైతే వెంటనే 112 నంబర్‌కు కాల్ చేయాలని, విద్యార్థినులు శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు. సదస్సు ముగింపులో యువత, ప్రజలతో రోడ్డు భద్రత నియమాలు పాటిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సీఐ గోపాలకృష్ణ, ఎస్ఐ సంతోష్ కుమార్, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ లతాశ్రీతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# 12 ఏళ్ల మోదీ పాలన ప్రజారంజక పాలన-పాయం వెంకయ్య



**చింతూరు, పెన్ పవర్, జూన్ 14:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో గత 12 ఏళ్లుగా దేశంలో అవినీతి రహిత, అభివృద్ధి ప్రధానమైన పాలన కొనసాగుతోందని పోలవరం జిల్లా బీజేపీ ఎస్టీ మోర్చా ఉపాధ్యక్షుడు పాయం వెంకయ్య అన్నారు. ఆదివారం చింతూరులోని లారీ ఓనర్స్ అసోసియేషన్ భవనంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన పురోగతి సాధించి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో భారత్ ఐదో స్థానానికి చేరుకోవడం మోదీ ప్రభుత్వ సమర్థ పాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. దేశ ప్రజల విశ్వాసం, మద్దతు వల్లే ఈ స్థాయి అభివృద్ధి సాధ్యమైందని అన్నారు. సమావేశానికి ముందు నాయకులు జాతీయ రహదారి 30 నిర్మాణ పనులను పరిశీలించారు. సుమారు రూ 340 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రహదారి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదని ఆరోపించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ క్వాలిటీ కంట్రోల్ అధికారులకు, సంబంధిత శాఖలకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఆదివాసీ మహిళ ద్రౌపది మూరము ను రాష్ట్రపతిగా నియమించడం బీజేపీ ప్రభుత్వ సామాజిక న్యాయానికి నిదర్శనమని వెంకయ్య పేర్కొన్నారు. పోలవరం నిర్వాసితుల సంక్షేమం, ఏజెన్సీ ప్రాంతాల అభివృద్ధి, రోడ్లు, విద్య, వైద్య రంగాల పురోగతికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందన్నారు. కేంద్ర పథకాల ద్వారా మారుమూల ప్రాంతాల ప్రజలు ఆర్థికంగా ఎదుగుతున్నారని చెప్పారు. రాబోయే రోజుల్లో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను గ్రామస్థాయికి తీసుకెళ్లి ప్రజలకు వివరించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి బి. కామేశ్వరి, చింతూరు మాజీ మండల అధ్యక్షుడు డీవీఎస్ రమణారెడ్డి (చిట్టిబాబు), వీఆర్‌పురం మండల అధ్యక్షుడు ముత్యాల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.




# పేరుకె దొరమామిడి పంచాయతీ.. కనీస అవసరాలు ఆమడ దూరం...





**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 14:** మండల కేంద్రానికి సుమారుగా 12 కిలోమీటర్లు దూరంలో ఉన్న దొర మామిడి పంచాయతీలో వీధిలైట్లు వెలగక పోయినా పట్టించుకునే నాధుడే పరువయ్యాడని అలాగే రోడ్లు ప్రక్కన సైడ్ కాలువలు లేక ఎక్కడ మురిగినీరు అక్కడే నిలిచిపోతుందని ,రాబోయేది వర్షాకాలం కావడంతో వ్యాధులు వచ్చే అవకాశం ఉందని గ్రామస్తులు తెలిపారు. ఈ ఊర్లో మంచినీటి బోర్లు ఉన్నప్పటికీ అవి కానీ పనిచేయవు అని గ్రామస్తులు తెలిపారు.

ఈ ఊర్లో మంచినీళ్లు ట్యాంక్ శుభ్రం చేసి ఎంతకాలం అయిందో గుర్తులేదు అని గ్రామస్తులు ఆపోతున్నారు.

కరెంటు లేకపోతే మంచినీళ్లకు కిలోమీటర్ల దూరం నడిచి వెళ్ళవలసిందే ,

దొర మామిడి పంచాయితీ సెక్రటరీ తమ గ్రామ నికి రావడమే అరుదు అని గ్రామస్తులు అంటున్నారు. దొరమామిడిలో వీధిలైట్లు వెలగక చీకటి పడితే చాలు ఊరంతా చిమ్మ చీకటిగా ఉంటుంది అని చాలా కాలం నుండి వీధిలైట్లు వెలగడం లేదని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం 6 దాటితే చాలు పిల్లలు ,పెద్దలు, వృద్ధులు అందరూ ఇంటికే పరిమిత అవుతున్నారని, తమను ఏ అధికారి పట్టించుకున్న దాఖలాలు లేవని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

కరెంటు పోతే కొన్ని రోజులు పాటు నీళ్లు లేక ఇబ్బంది పడుతున్నామని, ఈ మధ్యకాలంలో మోటార్ పనిచేయక మంచినీళ్లకు చాలా ఇబ్బందులు గురయ్యామని, ఊరికి ఆమడ దూరంలో ఉన్న మంచి నీటినూతి నుండి నీళ్లు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ,ఎండాకాలంలో మంచినీళ్లకు చాలా ఇబ్బందులు గురయ్యామని, గ్రామంలో ఏం జరిగినా అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదని ,దీనికి కారణం పేరుకి దొరమామిడి పంచాయతీ కార్యాలయాలు ఇదే పంచాయతీ పరిధిలో గౌరీపేట లో ఉండడం వల్ల అధికారులు సచివాలయాలను సందర్శిస్తున్నారు, తప్ప దొరమామిడిని సందర్శించే దాఖలాలు కరువయ్యా యి అని గ్రామస్తులు వాపోతున్నారు. మమ్మల్ని ఏ అధికారి పట్టించుకోక పోవడం శాపంగా మారిందని , తమ గ్రామానికి ఉన్న తారు రోడ్డు పై దమ్ము చక్రాల ట్రాక్టర్లు తిరగడం వలన రోడ్డు కూడా శిధిల అవస్థకు చేరుకోవడానికి సిద్ధపడుతుందని, కనీసం వారంలో ఒకటి రెండు సార్లు అధికారులు సందర్శించి ఉంటే గ్రామాన్ని ఇటువంటి ఇబ్బందులను గుర్తించవచ్చు అని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

# అడ్డతీగల లో ఏ.ఎస్.ఆర్ లైన్స్ క్లబ్ ఏర్పాటు,



**నూతన కార్యవర్గం ఎన్నిక...**

**అడ్డతీగల, పెన్ పవర్, జూన్ 14;** మండల కేంద్రమైన అడ్డతీగల లో ఆదివారం ఉదయం రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో అడ్డతీగల ఏ.ఎస్.ఆర్ లైన్స్ క్లబ్ ఏర్పాటుకు జోన్ చైర్ పర్సన్ అనుసూరి. నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నూతన కమిటీ ఏర్పాటుకు శ్రీకారం చుట్టాలు.

ఈ కార్యక్రమానికి అడ్డతీగల గ్రామ పెద్దలు, ప్రముఖులు హాజరవ్వగా, ముఖ్య అతిథులుగా మాజీ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ లయన్ డి.వి.ఎస్ రమేష్ రాజు మరియు లైన్ కే .వి సుబ్బరాజు డిస్ట్రిక్ట్ గవర్నర్ హాజరయ్యారు.

ఈ సందర్భంగా అడ్డతీగల ఏ.ఎస్.ఆర్ లైన్స్ క్లబ్ మొట్టమొదటి సమావేశాన్ని ఏర్పాటు చేసి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఏ. రాంప్రసాద్ సెక్రటరీగా బలరామమూర్తి, ట్రెజరర్గా ఎం. నాగేశ్వరరావు ఎన్నికయ్యారు.

అలాగే, ఏ. ఎస్. ఆర్ లైన్స్ క్లబ్ తరపున అడ్డతీగల గ్రామ ప్రజలకు, గిరిజనులకు మెడికల్ క్యాంప్స్, డయాబెటిక్ అవేర్నెస్ క్యాంప్స్, స్కూల్ హెల్త్ అవేర్నెస్ క్యాంపులు నిర్వహించాలని కొత్త కార్యవర్గం నిర్ణయించింది. ఈ తొలి అడుగుతో అడ్డతీగల ప్రాంతంలో సేవా కార్యక్రమాలు మరింత వేగవంతం గా అడుగులు వేస్తామని నూతన కార్యవర్గం ఆశాభావం వ్యక్తం చేశారు .

# తీవ్ర గాయాలతో వచ్చిన చుక్కలు జింక మృతి.



**జింక మృతదేహాన్ని దహనం చేసిన అటవీశాఖ అధికారులు**

**గోకవరం పెన్ పవర్ జూన్ 14:--** తీవ్ర గాయాలతో చుక్కల జింక జనావాసాల్లోకి వచ్చిమృతి చెందింది. దీనికి సంబంధించి అటవీ శాఖ బీట్ ఆఫీసర్ భాస్కర్ కృష్ణ తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గోకవరం మండలం రాజమహేంద్రవరం పరిధిలోని వెదురుపాక గ్రామంలోనికి శనివారం సాయంత్రం ఒక కొమ్ము విరిగిపోయిన చుక్కల జింక తీవ్ర రక్తస్రావం అవుతూ గ్రామంలోకి రావడాన్ని గమనించిన స్థానికులు ఆ జింకను పట్టుకుని ప్రథమ చికిత్స చేసి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడం జరిగిందని తక్షణం రాజమహేంద్రవరం రేంజ్ ఆఫీసర్ ఆదేశాల మేరకు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఏ భాస్కర్ కృష్ణ,రంప ఎర్రపాలెం బీట్ ఆఫీసర్ కే మనోహర్, వెదురుపాక గ్రామం చేరుకుని ఆ జింకను గోకవరం పశువైద్య అధికారితో చికిత్స చేయించడం జరిగిందని అయితే ఒక కొమ్ము విరిగిపోయి అప్పటికే తీవ్ర రక్తస్రావం అవ్వడం తో (సహజంగా జనావాసాలలో ప్రజలను చూస్తే హార్ట్ బీట్ పెరుగుతుందని ఈవిధంగా కూడా చనిపోయే అవకాశాలు ఉండొచ్చని) వైద్యం చేసిన సరే కొద్ది సేపటికి మృతి చెందిందని ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఏ భాస్కర్ కృష్ణ తెలిపారు. దీనితో వెదురుపాక విఆర్ఓ శ్రీను మరియు గ్రామస్తులు సమక్షంలో పోస్ట్మార్టం నిర్వహించి సమీపంలో ఉన్న పోలవరం కాలువ గట్టుపైన దహనం చేయడం జరిగిందని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ భాస్కర్ కృష్ణ తెలిపారు. తిరుమలయపాలెం అటవి ప్రాంతం నుండి దారి తప్పి వెదురుపాక గ్రామంలోకి



పోలవరం కాలువ ద్వారా వచ్చిఉండొచ్చని కొమ్ము విరిగి పోవడానికి గల కారణాలు ఏమిటనే దానిపై ఆరా తీస్తున్నామని వన్యప్రాణి సంరక్షణ కోసం కఠినమైన చట్టాల అమలు చేస్తున్నామన వన్యప్రాణుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎట్టి పరిస్థితిలో కూడా వన్యప్రాణులకు హాని తలపెట్టే పనులు చేస్తే ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా గ్రామస్తులకు ఆయన హెచ్చరిస్తూ వన్యప్రాణులకు సంబంధించి ఏదైనా సమాచారం తెలిస్తే తక్షణం అటవీశాఖ అధికారులకు తెలియ పరచాలని ఆయన గ్రామస్తులను కోరారు.

# వరదలు వస్తే గిరిజన గ్రామాలు అంధకారంలో...

**–శబరి పరివాహక ప్రాంతంలోని 20 గ్రామాలకు కొత్త విద్యుత్ లైన్ మంజూరు చేయాలి**

**–చేయకపోతే 20 గ్రామాల ప్రజలతో ఐటీడీఏ ముట్టడి**

**కూనవరం,పెన్ పవర్,జూన్, 14.**పోలవరం ప్రాజెక్టు ముంపు పేరుతో రాష్ట్ర ప్రభుత్వం శబరి పరివాహక ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసి గిరిజనులను దారుణంగా మోసం చేస్తుందని పెద్దార్కూర్ గ్రామంలో నిర్వహించిన సిపిఎం కార్యకర్తల జనరల్ బాడీ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి బాబు బొర్రయ్య తీవ్రంగా ఖండించారు.?ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు రేపాక, భగవన్ పురం సహా శబరి పరివాహక ప్రాంతంలోని 20 గ్రామాలకు భూమి ప్యాకేజీ,ఆర్ అండ్ ఆర్ పునరావాస సాయం అందించకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని అన్నారు.?2017,2019 లోనే నోటీసులు ఇచ్చి,ఇప్పుడు 45.5 కాంటూర్ లెక్కలు చెబుతూ గిరిజనులను వంచించే ప్రయత్నం చేస్తున్నారనీ ?భూమి ప్యాకేజీ ఇవ్వకపోగా,రైతు భరోసా,సబ్సిడీ విత్తనాలు కూడా నిలిపివేసి రైతుల పొట్ట గొడుతున్నారనీ అన్నారు.?పునరావాసం కల్పించకుండా ఖాళీ చేయిస్తే ఊరుకోమని హెచ్చరించారు.?పెద్దార్కూర్ గ్రామాన్ని 2027 మార్చి నాటికి ఖాళీ చేయిస్తామని అధికారులు అనడం హాస్యాస్పదంగా ఉందని, కనీసం ఇళ్లకు వాల్యూ కట్టి,భూమి ఎక్కడ ఇస్తారో చూపించకుండా ఎలా తరలిస్తారని అన్నారు. గ్రామాన్ని ఒకే యూనిట్‌గా ప్రకటించి అందరికీ న్యాయం చేయాలనీ డిమాండ్ చేశారు.?వరదలు వస్తే రెండు,మూడు నెలల పాటు కరెంటు లేక గిరిజన గ్రామాలుఅంధకారంలోమగ్గుతున్నాయని,కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా అధికారుల్లో చలనం లేదని, గిరిజనులంటే అధికారులకు అంత



చులకనా భావం ఉందని పేర్కొన్నారు.తక్షణమే చిన్నార్కూర్ గ్రామం నుండి బొజ్జరాయిగూడెం గ్రామం వరకు మెయిన్ రోడ్డు మీదుగా కొత్త కరెంట్ లైన్ వేసి 20 గ్రామాలకు చీకట్ల నుండి విముక్తి కల్పించాలనీ కోరారు.?కొత్త కరెంట్ లైన్ మంజూరు చేయకపోతే 20 గ్రామాల ప్రజలతో కలిసి ఐటీడీఏ ఆఫీసును ముట్టడిస్తామని,సమస్య పరిష్కారం అయ్యే వరకు అక్కడి నుండి కదిలేదే లేదనీ హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు మేకల నాగేశ్వరరావు,మడకం నాగమణి, ఎంపిటిసి ధర్మల అమ్మాజీ,తెల్లం తమ్మయ్య, సత్యనారాయణ, మడకం సత్యనారాయణ,తొండ లక్ష్మయ్య,మడకం బుజ్జి,జోగయ్య, ధర్మముల లక్ష్మయ్య,మడకం రమేష్ తదితరులు పాల్గొనారు.

## వైద్య ఖర్చుల భారంతో ఇబ్బంది పడ్డ ఎవరైనా సీఎంఆర్ఎఫ్ కు దరఖాస్తు చేసుకోవచ్చు

**టిడిపి జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్**



**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 14:** జగ్గంపేట రావులమ్మ నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఆదివారం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 22 మంది లబ్ధిదారులకు రూ.6,90,766 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షులు, నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ జ్యోతుల నవీన్ చేతుల మీదుగా చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షులు జీను మణిబాబు మాట్లాడుతూ జగ్గంపేట నియోజకవర్గంలో వైద్యం చేయించుకుని ఆర్థిక సాయం కోసం ఎదురుచూస్తున్న పేదలకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరయ్యాయని తెలియజేశారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బంది పడుతున్న వారు ఎవరైనా సరే సీఎంఆర్ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవచ్చని మణిబాబు పేర్కొన్నారు. అర్హుల దరఖాస్తులను ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ కార్యాలయంలో స్వీకరిస్తామని, వెంటనే ప్రభుత్వానికి పంపి సాయం అందేలా చూస్తామని స్పష్టం చేశాడు. అనారోగ్యంతో కుంగిపోయిన పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ పెద్ద ఊరటనిస్తోందని, ప్రభుత్వ సాయాన్ని సకాలంలో అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వీరంరెడ్డి కాశిబాబు, రేఖ బుల్లి రాజు, పాండ్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర, పీలా మహేష్, నండ్ల చిరంజీవి, పోతాబత్తుల శ్రీను, గల్లా శ్రీను, భవన పోసియ్యా , కరణం బోరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## జగ్గంపేటలో పోలీసుల సైకిల్ ర్యాలీ

**హాజరైన జగ్గంపేట ఎమ్మెల్యే నెహ్రూ**




**జగ్గంపేట, పెన్ పవర్, జూన్ 14:** జగ్గంపేటలో ఆదివారం జగ్గంపేట సిఐ బి.తిరుపతిరావు ఆధ్వర్యంలో జగ్గంపేట పోలీస్ స్టేషన్ వద్ద నుంచి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీకి ముఖ్యఅతిథిగా జగ్గంపేట ఎమ్మెల్యే, టిటిడి బోర్డు సభ్యులు జ్యోతుల నెహ్రూ హాజరై సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జగ్గంపేట సిఐ తిరుపతిరావు, జగ్గంపేట ఎస్సై రఘునాథరావు, గండేపల్లి ఎస్ఐ శివ నాగబాబు, కిర్లంపూడి ఎస్ఐ సతీష్ కుమార్ వారి సిబ్బందితో సైకిల్ ర్యాలీ ద్వారా జగ్గంపేటలోని మెయిన్ రోడ్ , గ్రామాలగుండా పర్యటించారు. ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ ద్వారా ప్రజలకు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ, మరియు శారీరక దృఢత్వంపై అవగాహన కల్పించారు.

## ట్రిపుల్ ఐటిల్లో 5 సీట్లు సాధించిన శంఖవరం ఏపి మోడల్ స్కూలు విద్యార్థులు...





**శంఖవరం పెన్ పవర్ జూన్ 14:**–కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం మండల కేంద్రం శంఖవరంలోని ఏపి మోడల్ స్కూలుకు చెందిన 5గురు విధ్యార్థులు త్రిపుల్ ఐటిల్లో సీట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఏ వీరరాజు తెలిపారు. రాష్ట్రంలోని ఏపి మోడల్ స్కూళ్ళలోనే అత్యధికంగా 594 మార్కులు సాధించిన ఎస్ స్వాతి, ఇ దేవకి 581 మార్కులు, వై అపర్ణదేవి 581 మార్కులు, జి గౌతమి శరణ్య 577 మార్కులు, బి నవ్య 573 మార్కులు సాధించగా, వీరికి శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు త్రిపుల్ ఐటిల్లో సీట్లు సాధించారు. వీరిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అన్నవరం దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ నెంబరు పర్వత సురేష్ ప్రిన్సిపాల్ వీరరాజు, స్కూలు కమిటి చైర్మన్ జి లక్ష్మీజ్యోతి, కాకినాడ జిల్లా డిఇఓ పి రమేష్, శంఖవరం మండలం ఎంఇఓలు ఎస్వీ రమణ, టి గోవింద్, ఉపాధ్యాయులు, మోడల్ స్కూలు సిబ్బంది అభినందించారు.

## ఎనిమిది నెలలుగా టీచర్ లేకుండానే అంగనర్‌వాడీ కేంద్రం నిర్వహణ కిట్లు తెరచుకోవడం లేదు







**ఏలూరు జూన్ 14 పెన్ పవర్ :** పెదపాడు ప్రాజెక్టు పరిధిలోని పెదపాడు సెక్టార్ వీరమ్మగుంట అంగన్‌వాడీ కేంద్రం సెంటరర్ నెం.19 గత ఎనిమిది నెలలుగా టీచర్ లేకుండానే కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు.ఈ సెంటర్ లో పరిచేస్తున్న టీచర్ గత అక్టోబర్ నెలలో విధుల నుండి తప్పుకున్నారు.అప్పటి నుండి సెంటర్‌ను హెల్పర్ నిర్వహిస్తున్నారు.ఎనిమిది నెలలుగా ఈ సెంటరర్‌కు అంగన్ వాడీ టీచర్‌ను ప్రాజెక్టు అధికారులు నియమించకుండా ఆయాతోనే కాలక్షేపం చేస్తున్నారు.గత ఎనిమిది నెలలుగా సెంటర్‌లో పోషణ్ వాటిక లేకున్నా పర్యవేక్షణాధికారులు చర్యలు తీసుకోకుండా చూసి చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.అంగన్ వాడీ సహాయకురాలు తన సొంత డబ్బులు వెచ్చించి పోషణ్ వాటికకు,కేంద్రానికి రక్షణ గేటును ఏర్పాటు చేశారు.

**ఆరోగ్య భరోసా కిట్లు తెరచుకోవడం లేదు**

అంగన్ వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆరోగ్య సంరక్షణకు కూటమి ప్రభుత్వం కిట్టు సమకూర్చింది.చిన్నారులు కింద పడినా,చిన్నపాటి గాయాలైనప్పుడు ఆసుపత్రులకు తరలించకుండా వైద్య సిబ్బంది కోసం ఎదురుచూడకుండా స్దానికంగానే చికిత్స ఏర్పాట్టు చేశారు.ప్రతి కిట్‌లో 11 రకాల మందులు చేతుల శుభ్రతతో పాటు వాటిని ఎలా వాడాలి..ఎంత మోతాదులో వాడాలో నియమనిభంధనలతో సైతం కిట్లలో పొందుపరిచారు. చిన్నారులతో పాటు గర్భిణులు,బాలింతలకు అవసరవైన మందులు కేంద్రాలకు సరఫరా చేశారు. అయితే కేంద్రం నిర్వాహకులు వాటిని ఉపయోగించిన దాఖలాలు లేవు.

**పర్యవేక్షణ లోపం :**

కేంద్రంలో చిన్నారులకు ఎటాచ్డ్ టాయిలెట్ సౌకర్యం ఉన్నా చిన్నాదులను కాల కృత్యాలు తీర్చుకోవడానికి ఆరుబయటకు పంపిస్తున్నారు.కేంద్రంలోని పోషణ్ వాటిక నిర్వాహణ అద్వానంగా ఉంది, కనీసం వాటికలో ఒక్క కాయగుర మొక్క కూడా లేదు.కేంద్రానికి ఉన్న నామ బోర్డు కూడా వెలసిపోయి సెంటర్‌ను గుర్తించడానికిఅనువుగా లేదు.పర్యవేక్షణాధికారులు పరిశీలించి, పోషణ్ వాటికలో కూరగాయల మొక్కలు పెంచేలా ,చిన్నారులు ఆరుబయట కానిచ్చేయకుండా టాయిలెట్ వినియోగంలోకి తెచ్చే విధంగా చుర్మలు తీసుకోవాలని గ్రామస్దులు కోరుతున్నారు.

## కాలయాపన చాలు పేదల పింఛన్లు వెంటనే ఇవ్వండి



**ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థి పాటంశెట్టి**

**గోకవరం పెన్ పవర్ జూన్ 14:--** కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి రెండు సంవత్సరాలు పూర్తయిన పెన్షన్లు ఇస్తానని మాట దాటవేశారే కానీ నేటికీ కూడా లేదని ఇలా కాలక్షేపం చేయడం మాని పేదలకు సామాజిక పెన్షన్లు తక్షణం మంజూరు చేయాలని జగ్గంపేట నియోజకవర్గం ఎమ్మెల్యే స్వతంత్ర అభ్యర్థి పాఠం శెట్టి సూర్యచంద్ర డిమాండ్ చేస్తూ ఆయన మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.నియోజక వర్గంలో పేదల కష్టాలను వివరిస్తూ పాలకులను, అధికారులను నిలదీసిన పాటంశెట్టి సూర్యచంద్ర.?పింఛన్లు రాక అవస్థలు పడుతున్న బాధితులు బూరుగుపూడి గ్రామంలో సూర్యచంద్రను కలిసి తమ సమస్య పరిష్కరించాలని కోరడంతో బాధితులకు ధైర్యం చెప్పి అండగా ఉంటామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చే వరకు పేదలకు పింఛన్లు, ప్రభుత్వ పథకాలు పూర్తి స్థాయిలో వచ్చే విధంగా పేదల పక్షాన పోరాడుతామని సూర్యచంద్ర స్పష్టం చేశారు.ఎన్నికల ముందు అబద్ధాలు చెప్పి, అధికారం లోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటుతున్నా పేదలకు సామాజిక పింఛన్లు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పాటంశెట్టి సూర్యచంద్ర ఆరోపించారు. జగ్గంపేట నియోజకవర్గంలో పింఛన్లు అందక నానా అవస్థలు పడుతున్న వృద్ధులు, వితంతువులు, వికలాంగుల బాధలు, కష్టాలు ప్రభుత్వానికి వివరించారు.స్థానిక ఎమ్మెల్యే, కూటమి ప్రభుత్వం ప్రజలను నిలువునా వంచించారన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రతీ పేదవాడికి పింఛన్ ఇస్తామని నమ్మబలికి ఓట్లు వేయించుకున్నారని గెలిచాక రెండేళ్లు గడుస్తున్నా అర్హులకు పింఛన్లు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని లబ్ధిదారుల పొట్టగొడుతూ, నిస్సిగ్గుగా విజయోత్సవాలు జరుపు కోవడం ప్రజాస్వామ్యానికే విరుద్ధమన్నారు. ఇప్పటికైనా ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలన్నీ నెరవేర్చాలని పాటంశెట్టి సూర్యచంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## తహశీల్దార్‌గా పదోన్నతి పొందిన మొసలి సూరిబాబుకు ఘన సన్మానం



**కాకినాడ, పెన్ పవర్ జూన్ 14**: పదోన్నతి అనేది ఉద్యోగ జీవితంలో గౌరవప్రదమైన అవకాశం మాత్రమే కాకుండా మరింత బాధ్యతగా భావించి విధులు నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షుడు పితాని త్రినాధరావు అన్నారు.ఆదివారం కాకినాడలోని రెవెన్యూ అసోసియేషన్ మందిరంలో తాళ్లరేవు మండల డిప్యూటీ తహశీల్దార్‌గా పనిచేస్తూ శంఖవరం మండల తహశీల్దార్‌గా పదోన్నతి పొందిన మొసలి సూరిబాబుకు అభినందన సభ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న పితాని త్రినాధరావు మాట్లాడుతూ, సూరిబాబు ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఆయన పనితీరును గమనిస్తున్నానని తెలిపారు. రెవెన్యూ సంఘంలో కోశాధికారిగా పనిచేసి అత్యధిక మెజారిటీతో ఎన్నిక కావడం ఆయనకు ఉన్న ఆదరణకు నిదర్శనమని పేర్కొన్నారు. శంఖవరం మండలంలో వీఐపీల రాకపోకలు ఎక్కువగా ఉంటాయని,అక్కడ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. పదోన్నతి పొందిన సూరిబాబు మాట్లాడుతూ, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా విధులు నిర్వర్తించి మండల ప్రజల మన్ననలు పొందేందుకు కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా సూరిబాబు దంపతులను తాళ్లరేవు మండల రెవెన్యూ సిబ్బంది, వీఆర్వోలు, వీఆర్ఏలు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అసోసియేషన్ కార్యదర్శి ఎస్.రామ్మోహన్‌రావు,జిల్లా ఉపాధ్యక్షులు కె. చంద్రశేఖర్ రెడ్డి, ట్రెజరర్ కె.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# చిన్నారిని ముద్దు చేసిన మోదీ.. వీడియో వైరల్

**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల్లో ప్రవాస భారతీయులు చూపే ఆప్యాయత, హడావుడి గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. తాజాగా ఆయన ఫ్రాన్స్ పర్యటనలోనూ అదే తరహా దృశ్యాలు పునరావృతమయ్యాయి. ఫ్రాన్స్‌లోని ప్రముఖ నగరమైన నైస్ కు చేరుకున్న ప్రధాని మోదీకి అక్కడి భారత సంతతి ప్రజలు అత్యంత ఘనంగా వైభవంగా స్వాగతం పలికారు. అయితే ఈ స్వాగత వేడుకల్లో జరిగిన ఒక అందమైన సంఘటన ప్రస్తుతం సోషల్ మీడియాను ఊపేస్తోంది.

**చిన్నారిపై మోదీ చూపిన ఆప్యాయత.. నెటిజన్లు ఫిదా**

స్వాగత కార్యక్రమానికి హాజరైన ప్రవాస భారతీయుల గుంపులో ఉన్న ఒక చిన్నారి ప్రధాని మోదీ దృష్టిని ఆకర్షించింది. ఆ చిన్నారిని చూడగానే ఎంతో మురిసిపోయిన మోదీ వెంటనే ఆమెను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని ఎత్తుకుని ముద్దు పెట్టుకున్నారు. ఆ తర్వాత ఆ చిన్నారితో కాసేపు సరదాగా ముచ్చటిస్తూ, ఎంతో ప్రేమగా పలకరించారు. దేశ ప్రధాని అంతటి స్థానంలో ఉండి కూడా ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి ఒక చిన్నారిపై ఆయన చూపిన వాత్సల్యం అక్కడున్న వారిని ఎంతగానో ఆకట్టుకుంది. ఈ హృదయపూర్వక దృశ్యాలను అక్కడి వారు తమ కెమెరాల్లో బంధించగా ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియా వేదికలపై విపరీతంగా వైరల్ అవుతోంది. మోదీలోని మాతృహృదయాన్ని, పిల్లల పట్ల ఆయనకున్న ప్రేమను నెటిజన్లు ప్రశంసలతో ముంచెత్తుతున్నారు.

**సాంస్కృతిక నృత్యాలు.. మారుమోగిన 'భారత్ మాతా కీ జై' నినాదాలు**

ప్రధాని మోదీకి స్వాగతం పలికేందుకు నైస్ నగరంలో ప్రవాస భారతీయులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. చేతుల్లో భారత జాతీయ జెండాలను పట్టుకుని "భారత్ మాతా కీ జై" అంటూ వారు చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా హోరెత్తిపోయింది.

**ప్రత్యేక ఆకర్షణగా భారతీయ నృత్యాలు**

ఈ స్వాగత వేడుకల్లో భారతీయ యువతులు ప్రదర్శించిన సాంప్రదాయ నృత్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా వారు చేసిన నృత్యాలను ప్రధాని మోదీ ఎంతో ఆసక్తిగా తిలకించారు. అనంతరం ఆ కళాకారుల దగ్గరకు వెళ్లి వారిని ప్రత్యేకంగా అభినందించారు. అంతేకాకుండా అక్కడికి వచ్చిన ప్రవాస భారతీయులతో మోదీ ఆత్మీయంగా ముచ్చటించి వారి కుశలప్రశ్నలు, అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు.



**భావోద్వేగానికి గురైన ప్రధాని.. 'ట్విట్టర్' వేదికగా స్పందన**

నైస్ నగరంలో లభించిన అపూర్వ స్వాగతంపై ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియా వేదికగా ఎంతో భావోద్వేగంతో స్పందించారు. "మనం మాతృభూమికి వేల కిలోమీటర్ల దూరంలో ఉన్నప్పటికీ దేశంతో మన ప్రవాస భారతీయుల అనుబంధం ఎంతో బలంగా కొనసాగుతోంది" అని మోదీ పేర్కొన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను విదేశీ గడ్డపై కూడా వారు ఎంతో గౌరవంగా నిలబెడుతున్నారని ఆయన కొనియాడారు. నైస్ నగరంలో లభించిన ఈ ఆత్మీయ స్వాగతం, ప్రేమ తనకు ఎంతో ఆనందాన్ని, తృప్తిని కలిగించాయని ప్రధాని ట్వీట్ చేశారు.

ప్రస్తుతం ఈ పర్యటనకు సంబంధించిన ఫోటోలు, చిన్నారి వీడియో ఇంటర్నెట్‌లో ట్రెండింగ్‌లో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు ఈ వీడియోను షేర్ చేస్తూ "ఇది కదా మన దేశ నాయకుడి గొప్పతనం" అంటూ కామెంట్లు పెడుతున్నారు.


03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

కోర్టు పబ్లికేషన్ యాడ్స్

కేవలం

యాడ్ 500/-

'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి


# తుని చిన్నారి కేసు మిస్టరీ.. ఆ 15 నిమిషాల్లో ఏం జరిగింది?



**హైదరాబాద్ పెన్ పవర్:** కాకినాడ జిల్లా తునికి సమీపంలోని సీహెచ్ అగ్రహారం గ్రామంలో అదృశ్యమైన చిన్నారి జ్ఞానేశ్వరి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. పాప అదృశ్యమై వారం గడుస్తున్నా, ఎలాంటి ఆనవాళ్లు లభించకపోవడంతో కేసు మిస్టరీగా మారింది. అయితే ఇంటి నుంచి వెళ్లిన పాపను ఓ గ్రామస్థుడు చూడటం, ఆ సమయంలో కుక్క అడ్డుపడటంతో పాపను రక్షించలేకపోయాడని అంటున్నారు. గ్రామంలో మరికొందరి సాయంతో అతడు పాపను చూసిన ప్రదేశానికి వచ్చే సరికి అక్కడ జ్ఞానేశ్వరి లేదని చెబుతున్నారు. పాపను అతడు చూసి తిరిగి వచ్చే సరికి సుమారు 15 నిమిషాల సమయం పట్టిందని అంటున్నారు. ఈ మధ్యలోనే పాప అదృశ్యమైందని అంటున్నారు. దీంతో ఆ పది హేను నిమిషాల్లో ఏం జరిగిందో తెలుసుకునే దిశగా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 6న ఉదయం 11:50 గంటల ప్రాంతంలో చిన్నారి తండ్రి పొలం నుంచి ఇంటికి వచ్చాడు. పాపను భార్యకు అప్పగించి, ఆయన తిరిగి పొలానికి వెళ్ళిపోయాడు. ఆ సమయంలో తల్లి వేరే చిన్న పాపను చూసుకోవడంలో నిమగ్నమవడంతో, జ్ఞానేశ్వరి అటుగా వెళ్లిన విషయాన్ని గమనించలేకపోయింది. ఇదే క్రమంలో తండ్రి వెళ్లిన మార్గానికి దగ్గర్లో ఒంటరిగా ఉన్న పాపను ఓ గ్రామస్థుడు గమనించాడు. ఎండలో ఒంటరిగా ఉన్న చిన్నారిని రక్షించి, సురక్షితంగా ఇంటికి చేర్చాలనే ఉద్దేశంతో ఆయన పాప దగ్గరకు వెళ్లాడు. అయితే, అక్కడ ఉన్న ఒక కుక్క ఆయనను కరవబోవడంతో, భయపడి ఆయన వెనక్కి తగ్గి ఊర్లోకి వెళ్లిపోయాడు.

**ఆ 15 నిమిషాల్లో ఏమైంది?**

ఊర్లోకి వెళ్లిన ఆ గ్రామస్థుడు జరిగిన విషయాన్ని మిగిలిన వారికి చెప్పి, కొంత సమయం తర్వాత మరికొందరితో కలిసి తిరిగి పాప ఉన్న చోటుకి వచ్చాడు. కానీ, అంతలోనే అక్కడ పాప కనిపించలేదు. మధ్యాహ్నం 12:00 గంటల నుండి 12:15 గంటల మధ్య, అంటే కేవలం 15 నిమిషాల వ్యవధిలోనే పాప మిస్సయింది. వెంటనే గ్రామస్థులంతా కలిసి చుట్టుపక్కల ఎంత వెతికినా చిన్నారి ఆచూకీ దొరకలేదు.

**దర్యాప్తు ముమ్మరం చేసిన పోలీసులు**

చిన్నారి అదృశ్యంపై సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే రంగంలోకి దిగారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఆ 15 నిమిషాల వ్యవధిలో అసలేం జరిగింది? పాప దారి తప్పి ఎటైనా వెళ్లిందా? లేక ఎవరైనా కిడ్నాప్ చేశారా? అనే కోణాల్లో పోలీసులు ఆరా తీస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న బావులు, పొలాల గట్లు పరిశీలిస్తున్నారు. సీసీటీవీ విజువల్స్ ఆధారంగా విచారణ జరుపుతున్నారు. కళ్లెదుటే ఉన్న చిన్నారి అంతలోనే మాయమవడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. పాపకు సంబంధించిన ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

# 130 అడుగుల ఎత్తు నుండి 21 ఏళ్ల అమ్మాయి దుర్మరణం.. వంతెన పై నుంచీ!

**హైదరాబాద్ పెన్ పవర్:** అడ్వెంచర్ స్పోర్ట్స్ అంటేనే ప్రాణాలతో చెలగాటం అని చెప్పాలి. సరైన భద్రతా ప్రమాణాలు తీసుకోకపోతే అవి ఎంత ప్రమాదకరంగా మారుతాయో తెలిపే ఒక అత్యంత దారుణమైన ఘటన బ్రెజిల్‌లో జరిగింది. బంజీ జంప్ (రోప్ జంప్) చేయడానికి సిద్ధమైన 21 ఏళ్ల యువతిని, నిర్వాహకులు కనీసం సేఫ్టీ రోప్ కట్టకుండానే వంతెన పైనుంచి కిందకు తోసేశారు. దాంతో ఆమె 130 అడుగుల ఎత్తు నుంచి నేరుగా కింద పడి అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈ షాకింగ్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. ఆ వివరాలు ఇలా వున్నాయి..

**నిర్వాహకుల ఘోర నిర్లక్ష్యం:**

బ్రెజిల్‌లోని లైమీరా నగరంలో ఉన్న ఒక బ్రిడ్జ్ వద్ద మరియా ఎదువార్దా అనే యువతి బంజీ జంప్ చేయడానికి వెళ్ళింది. ఆమె ఫిజికల్ ఎడ్యుకేషన్ పూర్తి చేసిన స్పోర్ట్స్ లవర్. అయితే, జంప్ చేయించే క్రమంలో అక్కడి సిబ్బంది దారుణమైన పొరపాటు చేశారు. ఆమె శరీరానికి ప్రధానమైన సేఫ్టీ తాడును సరిగ్గా అమర్చకుండానే, ప్లాట్‌ఫారమ్ నుంచి వదిలేశారు.

**గాల్లోంచి చూస్తుండగానే దారుణం:**

ఆమె వంతెన పైనుంచి దూకిన మరుక్షణమే అక్కడున్న వాళ్లకు అసలు విషయం అర్థమైంది. తాడు కిందనే ఊడిపోయి ఉండటాన్ని గమనించిన కొందరు "అయ్యో తాడు.. తాడు కట్టలేదు!" అని గట్టిగా అరిచారు. కానీ అప్పటికే జరగకూడని నష్టం జరిగిపోయింది. సుమారు 40 మీటర్ల (130 అడుగులు) ఎత్తు నుంచి ఆమె అత్యంత వేగంగా కింద పడిపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే ఫైర్ ఫైటర్లు, డాక్టర్లు అక్కడికి చేరుకున్నా ప్రయోజనం లేకుండా పోయింది.

**అడవిలోకి పారిపోయిన కేటుగాళ్లు:**

ఈ ఘోర ప్రమాదాన్ని చూసి భయపడిపోయిన ఈవెంట్ ఆర్గనైజర్లు బాధితురాలిని కాపాడటం మానేసి, అక్కడి నుంచి సమీపంలోని అడవిలోకి పారిపోయారు. అయితే మిలిటరీ పోలీసులు హెలికాప్టర్ సహాయంతో రంగంలోకి దిగి గాలించి, వారిని పట్టుకున్నారు. ఇక ఈ ఘోర నిర్లక్ష్యానికి కారణమైన ఆరుగురు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

**అడ్వెంచర్ ఆటలపై పెరిగిపోతున్న ఆందోళన:**

ఈ హృదయ విదారక ఘటన ప్రపంచవ్యాప్తంగా అడ్వెంచర్ స్పోర్ట్స్ నిర్వహణపై పెద్ద చర్చకు దారితీసింది. కేవలం డబ్బుల కోసం ఎలాంటి అనుమతులు, కనీస భద్రతా ప్రమాణాలు లేకుండా ఇలాంటి ప్రమాదకరమైన ఆటలను నిర్వహించడం వల్లే ఇలాంటి ప్రాణాలు పోతున్నాయని జనాలు మండిపడుతున్నారు. ఇక సరదా కోసం చేసే ఇలాంటి సాహసాలు ఒక్కోసారి జీవితాన్నే ముగించేస్తాయి. నిర్వాహకుల చిన్న పొరపాటు ఒక యువతి ప్రాణాన్ని బలితీసుకుంది. అందుకే ఇలాంటి అడ్వెంచర్ గేమ్స్ ఆడేటప్పుడు కేవలం థ్రిల్ కోసం కాకుండా, అక్కడ సేఫ్టీ ప్రికాషన్స్ ఎలా ఉన్నాయో ఒకటికి రెండుసార్లు చూసుకోవడం ప్రాణాలకే రక్షణ.

# అరెరే.. కాపాడలేకపోయిన నోరా ఫతేహి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఫుట్ బాల్ ప్రపంచకప్- 2026 ఆతిథ్య దేశాలలో ఒకటైన కెనడాకు టొరంటో స్టేడియంలో జరిగిన ప్రారంభ వేడుక ఒక చారిత్రాత్మకమైన సందర్భం. తమ దేశ సంస్కృతి, చరిత్ర, సంగీతాన్ని ప్రపంచ ఫుట్‌బాల్ అత్యున్నత వేదికపై పరిచయం చేసుకునేందుకు కెనడాకు దక్కిన అద్భుతమైన అవకాశం ఇది. అయితే దురదృష్టవశాత్తూ ఈ ఈవెంట్ ఆశించిన స్థాయిలో ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయిందని విమర్శలొస్తున్నాయి. ఒకరోజు ముందు మెక్సికో సిటీ స్టేడియంలో జరిగిన ఓపెనింగ్ సెర్మనీలో కనిపించిన జోష్, భారీ శబ్దాలు ఇక్కడ టొరంటోలో ఎక్కడా కనిపించలేదు. శుక్రవారం వర్కింగ్ డే కావడం వల్లో ఏమో కానీ.. స్టేడియంలో చాలా సీట్లు ఖాళీగా దర్శనమిచ్చాయి. -బాహుబలి- చిత్రంలోని -మనోహరి- పాటతో తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన నోరా ఫతేహి ఈ వేడుకలో తన ప్రదర్శనతో సందడి చేసినా ఈ భారీ ఈవెంట్‌కు ఆశించిన క్రేజ్ తీసుకురావడంలో ఆమె కూడా విఫలమైందనే చెప్పాలి.

నిజానికి మెక్సికో వేడుకలతో పోలిస్తే కెనడియన్ వేడుకల్లో ఒక మంచి కథాంశం (మొజాయిక్ కాన్సెప్ట్) కనిపించింది. జెండాల నుండి యూనిఫారాల వరకు భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిబింబించేలా ప్రణాళిక చేశారు. కార్యక్రమం ప్రారంభంలో కెనడాకు చెందిన ఆదివాసీ (ఇండిజినస్) సంస్కృతికి అద్భుతమైన గౌరవం లభించింది. మానిటోబాకు చెందిన సింగర్-సాంగ్‌రైటర్ విలియం ప్రిన్స్ వేదికపై నిలిచి ...--తీరాల నుండి తీరాల వరకు...ఈ భూమి మొదటి ప్రజల నుండి మనం ఇక్కడ సమావేశమయ్యాము.. ఇది ఒక క్షణం మాత్రమే కాదు.. నిజమైన అనుబంధం-- అంటూ ప్రపంచానికి స్వాగతం పలికారు. కెనడా ఆదివాసీ సంస్కృతి అనేది పాటలు, కళలు, నృత్యాల సమాహారమని ఆయన అద్భుతంగా వివరించారు.

కానీ ఆ తర్వాత ఈ వేడుక పూర్తిగా ఒక కమర్షియల్ ఫిఫా ప్రొడక్ట్‌లా మారిపోయింది. కెనడా దేశం నీల్ యంగ్, ది వీకెండ్ వంటి గొప్ప సంగీత దిగ్గజాలను ప్రపంచానికి అందించింది. ఆ స్థాయి సంగీత వైభవాన్ని చూపించే అవకాశం ఉన్నా నిర్వాహకులు దాన్ని వదిలేశారు. గాయని అలెస్సియా కారా స్టేజ్ మధ్యలో ఉన్న ఒక గోల్డెన్ బాల్ నుండి ఎరుపు రంగు ట్రాక్‌సూట్‌లో వచ్చి తన పాటలతో ప్రదర్శన ఇచ్చింది. ఆమె పాడుతున్నప్పుడు చుట్టూ కెనడియన్ ప్రకృతి, డాల్ఫిన్లు, మూస్ వంటి జంతువుల విజువల్స్ ప్రదర్శించారు. ఆ తర్వాతే మనోహరి బ్యూటీ నోరా ఫతేహి -సీర్ సీర్- పాటతో స్టేజ్‌పైకి ఎంట్రీ ఇచ్చింది. ముందే రికార్డ్ చేసిన సాంగ్‌కు పెర్ఫార్మ్ చేసినట్లు అనిపించినా... నోరా తన గ్లామర్ స్క్రీన్ ప్రెజెన్స్ - డ్యాన్స్ మూమెంట్స్‌తో స్టేజ్ పై కాస్త ఎనర్జీని తీసుకురావడానికి ప్రయత్నించింది. కానీ ఈ నర్తకి ఒంటరి పోరాటం ఈవెంట్‌ను పూర్తిగా కాపాడలేకపోయింది.

ఈ 15 నిమిషాల వేడుకలో అత్యుత్తమ ప్రదర్శన పాలస్తీనియన్-చిలీకి చెందిన గాయని ఎలియానా- కెనడియన్ సింగర్ జెస్సీ రేయెజ్ ల వల్ల సాధ్యమైంది. వారిద్దరూ కలిసి పాడిన -ఇల్యూమినేట్- సాంగ్ ఈ ఓపెనింగ్ సెర్మనీకే హైలైట్‌గా నిలిచింది. మెక్సికోలో షకీరా పాడిన పాట కంటే ఈ టోర్నమెంట్ సాంగ్ చాలా బలంగా అనిపించింది.

చివరి ప్రదర్శనలు బాగున్నా అప్పటికే ఈ ప్రారంభ వేడుక ఒక అద్భుతమైన ఆరంభంలా కాకుండా.. ఏదో మమ అనిపించిన కార్యక్రమంలా మిగిలిపోయింది. మెక్సికో, కెనడా రెండు దేశాలూ ఊరించినంత స్థాయిలో ఓపెనింగ్ వేడుకలు అలరించలేకపోయాయి. ఇప్పుడు అందరి దృష్టి అమెరికాలోని లాస్ ఏంజిల్స్‌లో జరగనున్న చివరి ప్రారంభ వేడుకపై పడింది. ఈ ప్రదర్శనకు పాప్ స్టార్ కేటీ పెర్రీ నాయకత్వం వహించనుండగా విక్టరీ సాధ్యమేననే టాక్ వినిపిస్తోంది. మెక్సికో, కెనడాలు మిగిల్చిన వెలితిని పూడ్చి ఈ ప్రపంచకప్ వేడుకల వైభవాన్ని అమెరికా అయినా కాపాడుతుందో లేదో చూడాలి.

# వైసీపీ అఫీషియల్ ఫేస్‌బుక్ అకౌంట్ బ్లాక్? హ్యాకింగ్ ఘటన తర్వాత కీలక పరిణామం!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధికారిక ఫేస్‌బుక్ ఖాతా ప్రస్తుతం నెటిజన్లకు అందుబాటులో లేకపోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. నిరంతరం పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ విధానాలపై పోస్టులతో యాక్టివ్‌గా ఉండే ఈ అధికారిక పేజీ కోసం ఫేస్‌బుక్‌లో వెతికితే " భారతదేశంలో ఈ ఖాతా అందుబాటులో లేదు " అనే సందేశం కనిపిస్తోంది. దీంతో ఈ అకౌంట్‌ను మెటా సంస్థ బ్లాక్ చేసిందా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

**అసలేం జరిగింది? హ్యాకింగ్ కలకలం**

ఈ కీలక పరిణామానికి రెండు రోజుల ముందే వైసీపీ అధికారిక ఫేస్‌బుక్ ఖాతా హ్యాకింగ్‌కు గురైనట్లు సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. గుర్తుతెలియని సైబర్ నేరగాళు ఈ అకౌంట్‌ను హ్యాక్ చేసి, కొన్ని అశ్లీల, కమ్యూనిటీ నిబంధనలకు విరుద్ధమైన ఫొటోలను పోస్ట్ చేసినట్లు సమాచారం. ఈ అభ్యంతరకరమైన కంటెంట్ కొంత సమయం పాటు పేజీలో దర్శనమివ్వడంతో నెటిజన్లు షాక్‌కు గురయ్యారు. ఆ తర్వాత సాంకేతిక బృందం అలర్ట్ అయి ఆ పోస్టులను తొలగించినట్లు తెలిసింది.

**మెటా కఠిన చర్యలు?**

సాధారణంగా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాల్లో కమ్యూనిటీ గైడ్‌లైన్స్ అత్యంత కఠినంగా ఉంటాయి. అశ్లీలత, హింస లేదా సమాజానికి హాని కలిగించే ఎలాంటి కంటెంట్‌నైనా మెటా సంస్థ సహించదు. వైసీపీ అకౌంట్‌లో హ్యాకర్లు పోస్ట్ చేసిన అభ్యంతరకర కంటెంట్‌ను మెటా అల్గారిథమ్స్ గుర్తించి ఉండవచ్చు. లేదా వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున రిపోర్టులు వెళ్లడం వల్ల భద్రతా కారణాల దృష్ట్యా ఈ అకౌంట్‌ను తాత్కాలికంగా హోల్డ్‌లో పెట్టడం లేదా రీజినల్‌గా భారత్‌లో బ్లాక్ చేయడం జరిగి ఉండవచ్చని ఐటీ నిపుణులు భావిస్తున్నారు.

**పార్టీ నుంచి రాని అధికారిక ప్రకటన**

ఈ మొత్తం వ్యవహారంపై వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. ఈ అకౌంట్ నిజంగానే హ్యాకింగ్‌కు గురైందా? సాంకేతిక లోపాలు లేదా రికవరీ ప్రాసెస్‌లో భాగంగానే అకౌంట్ కనిపించకుండా పోయిందా? అనే ప్రశ్నలకు పార్టీ ఐటీ వింగ్ లేదా ముఖ్య నేతల నుంచి స్పష్టత రావాల్సి ఉంది. మరోవైపు మెటా సంస్థ కూడా ఈ బ్లాకింగ్‌పై ఎలాంటి అధికారిక వివరణ ఇవ్వలేదు.

**భద్రతపై పెరుగుతున్న ఆందోళనలు**

ఒక ప్రధాన రాజకీయ పార్టీకి చెందిన లక్షలాది మంది ఫాలోవర్లు ఉన్న అధికారిక ఖాతానే సైబర్ నేరగాళ్లు టార్గెట్ చేయడం ఐటీ వర్గాల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ ఘటనతో డిజిటల్ భద్రత, టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ వంటి రక్షణ వలయాల ప్రాధాన్యతపై మళ్లీ చర్చ మొదలైంది. ప్రస్తుతం వైసీపీ శ్రేణులు, సోషల్ మీడియా ప్రతినిధులు ఈ ఖాతా పునరుద్ధరణ ఎప్పుడు జరుగుతుందా అని పార్టీ అధికారిక ప్రకటన కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# వాడే భారత జట్టుకు బిగ్గెస్ట్ వీక్‌నెస్.. గంభీర్ ఇప్పటికైనా కళ్లు తెరవాలి..



**హైదరాబాద్ పెన్ పవర్:** గత కొన్నేళ్లుగా టీమిండియాని వేధిస్తున్న అతిపెద్ద సమస్య ఫాస్ట్ బౌలింగ్ ఆల్ రౌండర్ లేకపోవడమే.. స్టార్ ఆల్ రౌండర్ హార్దిక్ పాండ్యా గాయాలు, ఫిట్నెస్ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేళ.. రాబోయే 2027 వన్డే వరల్డ్ కప్ టోర్నమెంట్ ని దృష్టిలో పెట్టుకుని భారత మాజీ ఆటగాడు సురేష్ రైనా వార్నింగ్ ఇచ్చాడు. భారత్ గత రెండు ప్రపంచకప్‌లలో ఎక్కువగా హార్దిక్ పైనే ఆధారపడింది. కానీ, అతడు 2019లో వెన్నునొప్పితో, 2023 ప్రపంచకప్ టోర్నీ మధ్యలోంచే గాయంతో జట్టుని వదిలి పెట్టాడు. కీలక సమయాల్లో హార్దిక్ దూరం కావడంతోనే 2సార్లు టైటిల్స్ ని మిస్ చేసుకోవడం జరిగిందని సురేష్ రైనా వెల్లడించాడు.

**రీప్లేస్‌మెంట్ ప్లేయర్ రెడీ చేస్కోండి:**
సౌతాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా 2027 అక్టోబర్ 4 నుంచి వన్డే వరల్డ్ కప్ స్టార్ట్ కాబోతుంది. ఆఫ్రికా పిచ్‌లపై ఫాస్ట్ బౌలర్లు, పేస్ ఆల్ రౌండర్లే చాలా కీలకం కానున్నారు. ఇలాంటి సమయంలో , ఆఫ్ఘనిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు ముందు ఫిట్నెస్ క్లియరెన్స్ సాధించిన హార్దిక్, మళ్లీ ప్రాక్టీస్ సెషన్‌లో గాయపడి సిరీస్ కి దూరం కావడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. అందుకే, హార్దిక్‌కు సరైన రీప్లేస్‌మెంట్ ప్లేయర్ ని ఇప్పుడే రెడీ చేసుకోవాలని హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కు భారత మాజీ క్రికెటర్ సురేష్ రైనా సూచించాడు.

**బౌలింగ్ లో నితీష్ మెరుగువ్వాల్సిందే:**
హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్‌తో ఉంటే జట్టుకు కొండంత బలం అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.. కానీ అతను వర్క్‌లోడ్‌ను మేనేజ్‌మెంట్ చాలా జాగ్రత్తగా ప్లాన్ చేయాలని సురేష్ రైనా తెలిపాడు. ఒకవేళ పాండ్యా అందుబాటులో లేకపోతే జట్టులో ఆ ప్లేస్ ని ఎవరు భర్తీ చేస్తారనే ప్రశ్నకు భారత మేనేజ్మెంట్ ఇప్పుడే ఆన్సర్ రెడీ చేసుకోవాలన్నాడు. ప్రస్తుతం యువ ఆల్ రౌండర్ నితీష్ రెడ్డి జట్టుకు అందుబాటులో ఉన్నాడు.. అతను బౌలింగ్ లో ఇంకాస్త మెరుగవ్వాల్సిన అవసరం ఉందని రైనా పేర్కొన్నాడు.

**రో-- కో అనుభవం ఎంతో అవసరం:**
మరోవైపు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ప్రాధాన్యతపై కూడా సురేష్ రైనా కీలక వ్యాఖ్యలు చేశాడు. గత ప్రపంచకప్‌లలో రోహిత్, విరాట్ అద్భుతంగా రాణించి జట్టును ముందుండి నడిపించారని కొనియాడారు. శుభ్‌మన్ గిల్ వంటి యంగ్ ప్లేయర్స్ కి రో-- కో లాంటి సీనియర్ల తోడు, అనుభవం ఎంతో అవసరం.. ఫిట్‌నెస్‌తో ఉంటే ఏ ఆటగాడికైనా వయసు అనేది అస్సలు సమస్య కాదని రైనా తేల్చి చెప్పాడు.

# పాక్‌పై టాస్ గెలిచిన భారత్.. భారీ స్కోర్‌పై కన్నేసిన హర్మన్‌ప్రీత్



**హైదరాబాద్ పెన్ పవర్:** క్రికెట్ ఫ్యాన్స్ ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న మహిళల టీ20 ప్రపంచకప్ దాయాదుల పోరుకు టాస్ పడింది. బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో భారత మహిళల జట్టు టాస్ గెలిచింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ ఏమాత్రం ఆలోచించకుండా మొదట బ్యాటింగ్ తీసుకుంది. పిచ్ కండిషన్స్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండటంతో.. బోర్డుపై భారీ స్కోరు బోర్డును ఉంచి పాకిస్తాన్‌ను ఒత్తిడిలోకి నెట్టాలని టీమిండియా పక్కా ప్లాన్ వేసింది.
టీమిండియా కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ మాట్లాడుతూ.. మేము మొదట బ్యాటింగ్ చేయబోతున్నాం.. బ్యాటింగ్ చేయడానికి ఇది చాలా అద్భుతమైన పిచ్.. మొదట బ్యాటింగ్ చేసి బోర్డుపై ఒక మంచి టోటల్ సెట్ చేయాలనుకుంటున్నాం.. టీమ్ మొత్తం ఈ మ్యాచ్ కోసం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది.. గతేడాది వన్డే వరల్డ్ కప్ గెలిచిన కాన్ఫిడెన్స్‌ను ఈ టోర్నీలో కూడా కొనసాగిస్తాం.. మైదానంలో బెస్ట్ క్రికెట్ ఆడటమే మా టార్గెట్.. ఈ మ్యాచ్‌లో భారతి జట్టులోకి వచ్చింది.. మేము ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు మీడియం పేసర్లతో బరిలోకి దిగుతున్నామని కౌర్ స్పష్టం చేసింది.
పాకిస్తాన్ కెప్టెన్ ఫాతిమా సనా మాట్లాడుతూ.. ఒకవేళ టాస్ గెలిస్తే మేము కూడా మొదట బ్యాటింగ్ చేయాలనే అనుకున్నాం.. ఇదొక మంచి బ్యాటింగ్ ట్రాక్ లా కనిపిస్తోంది.. ఒక టీమ్‌గా మేము బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ బాగా రాణించబోతున్నాం.. ఇక్కడ పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలించేలా ఉన్నా.. మా దగ్గర మంచి బౌలింగ్ ఎటాక్ ఉంది.. ఈ మ్యాచ్‌లో సైరా ఆడుతోంది.. ఆమెకు ఇదే మొదటి వరల్డ్ కప్ మ్యాచ్ అని చెప్పుకొచ్చింది.
పాకిస్థాన్ మహిళా జట్టు: గుల్ ఫిరోజా, మునీబా అలీ (వికెట్ కీపర్), అయేషా జాఫర్, సైరా జబీన్, నటాలియా పర్వేజ్, అలియా రియాజ్, ఫాతిమా సనా (కెప్టెన్), రమీన్ షమీమ్, నష్రా సంధు, సాదియా ఇక్బాల్, తస్మియా రుబాబ్ భారత మహిళా జట్టు: స్మృతి మంధాన, షఫాలి వర్మ, జెమిమా రోడ్రిగ్స్, హర్మన్‌ప్రీత్ కౌర్ (కెప్టెన్), రిచా ఘోష్ (వికెట్ కీపర్), దీప్తి శర్మ, భారతీ ఫుల్మాలి, శ్రీ చరణి, క్రాంతి గౌడ్, శ్రేయాంక పాటిల్, అరుంధతీ రెడ్డి

# కప్ కొట్టి భారత్‌కి తీసుకొని రండి.. పాక్‌తో పోరుకు ముందు ఉమెన్స్ టీమ్‌కు రోహిత్, గంభీర్ స్పెషల్ మెసేజ్





**హైదరాబాద్ పెన్ పవర్:** : మహిళల టీ20 ప్రపంచకప్‌లో భాగంగా కాసేపట్లో (ఆదివారం) పాకిస్తాన్‌తో జరగబోయే హై-వోల్టేజ్ మ్యాచ్‌కు ముందు హర్మన్‌ప్రీత్ సేనకు మెన్స్ టీమిండియా ఆటగాళ్లు అదిరిపోయే సపోర్ట్ ఇచ్చారు. గతేడాది సొంతగడ్డపై జరిగిన వన్డే ప్రపంచకప్‌ను గెలుచుకుని హిస్టరీ క్రియేట్ చేసిన భారత మహిళల జట్టు.. ఇప్పుడు తమ తొలి టీ20 వరల్డ్ కప్ టైటిల్‌ను ముద్దాడాలనే కసితో బరిలోకి దిగుతోంది. ఈ క్రమంలో బీసీసీఐ (దీజజ×) ఎక్స్ (శ) వేదికగా షేర్ చేసిన ఒక ప్రత్యేక వీడియోలో రోహిత్ శర్మ, కోచ్ గౌతమ్ గంభీర్, శుభ్‌మన్ గిల్, శ్రేయస్ అయ్యర్, ఇషాన్ కిషన్‌లు మహిళల జట్టుకు ఆల్ ది బెస్ట్ చెబుతూ జోష్ నింపారు.

**ఈసారి కప్పు కొట్టాల్సిందే: రోహిత్ శర్మ**
గత కొన్ని ఏళ్లుగా టీమిండియా అమ్మాయిలు అద్భుతమైన క్రికెట్ ఆడుతున్నారని భారత స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ పేర్కొన్నారు. టీ20 వరల్డ్ కప్‌లలో చాలాసార్లు గెలుపుకు అత్యంత దగ్గరగా వచ్చి మిస్ అయ్యారు. కానీ, ఈసారి మాత్రం వాళ్లు కచ్చితంగా కప్పు కొట్టాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను.. దేశం మొత్తం వాళ్లకు సపోర్ట్‌గా ఉంది.. మన జట్టు చాలా పటిష్టంగా, బ్యాలెన్స్‌డ్‌గా ఉంది.. ఇంగ్లాండ్ కండిషన్స్‌ని వాళ్లు బాగా ఎంజాయ్ చేస్తారు.. మెన్స్ టీమిండియా తరపున అమ్మాయిలందరికీ ఆల్ ది బెస్ట్ అంటూ రోహిత్ విష్ చేశాడు.

**కప్పుని భారత్ కి పట్టురండి: కోచ్ గంభీర్**
టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ తన స్టైల్‌లో పవర్‌ఫుల్ మెసేజ్ ఇచ్చాడు. మీరు 140 కోట్ల మంది భారతీయులు గర్వపడేలా చేస్తారని నాకు నమ్మకం ఉంది. ప్రపంచ వేదికపై దేశానికి ప్రాతినిధ్యం వహించే అవకాశం అందరికీ రాదు.. మైదానంలో తప్పులు జరుగుతాయేమోనని అస్సలు భయపడకండి.. ఎప్పుడు డౌట్ వచ్చినా పాజిటివ్ రూట్‌నే ఎంచుకోండి.. గుడ్ లక్.. కప్పు ఇంటికి (భారత్ కి) పట్టురండి అంటూ గంభీర్ కోరాడు.

**గిల్, శ్రేయస్, ఇషాన్ 'కిర్రాక్' మోటివేషన్:**
కెప్టెన్ శుభ్‌మన్ గిల్: మీరు గతంలోనే వరల్డ్ కప్ గెలిచి హిస్టరీ క్రియేట్ చేశారు.. ఈసారి కూడా ఖచ్చితంగా గెలుస్తారు. మా పూర్తి మద్దతు మీకే ఉంటుందని పేర్కొన్నాడు.

# ప్రభాస్ లేకుంటే.. ఆ సినిమా షెడ్డుకేనా?



పాన్



ఇండియా స్టార్ ప్రభాస్ కెరీర్ లో ఎన్నో బ్లాక్ బస్టర్ సినిమాలు ఉన్నప్పటికీ, అభిమానులు గుర్తు చేసుకోవడానికి ఇష్టపడని కొన్ని మూవీలు కూడా ఉన్నాయి. అలాంటి వాటిలో ముందుగా చెప్పుకునే పేరు రెబల్. భారీ అంచనాల మధ్య విడుదలైన ఆ చిత్రం బాక్సాఫీస్ వద్ద తీవ్ర నిరాశ పరిచింది. అయితే తాజాగా ఆ సినిమా వెనుక జరిగిన విషయాల గురించి నిర్మాతలు చేసిన కామెంట్స్ ఆసక్తికరంగా మారాయి.దర్శకుడు రాఘవ లారెన్స్ తెరకెక్కించిన ఆ సినిమాలో ప్రభాస్ సరసన తమన్నా, దీక్షా సేథ్ హీరోయిన్లుగా నటించారు. రెబల్ స్టార్ కృష్ణంరాజు కీలక పాత్ర పోషించారు. 2012 సెప్టెంబర్ 28న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అప్పట్లో భారీ బడ్జెట్ తో రూపొందిన ఆ సినిమా.. వసూళ్ల పరంగా వెనుకబడటంతో ప్రభాస్ కెరీర్ లోని పెద్ద డిజాస్టర్లలో ఒకటిగా నిలిచింది.ఇటీవల రెబల్ నిర్మాతలు జే భగవాన్, జే పుల్లారావు సినిమా నిర్మాణ సమయంలో ఎదురైన కష్టాలు గుర్తు చేసుకున్నారు. వారు చెప్పిన విషయాలు చూస్తే, రెబల్ విడుదల కావడమే ఒక పెద్ద సవాల్ గా మారిందని అర్థమవుతోంది. సినిమాను ప్రారంభించినప్పుడు ఒక బడ్జెట్ అనుకుని ముందుకెళ్లామని, ఒప్పందాలు కూడా చేసుకున్నామని నిర్మాతలు తెలిపారు.కానీ షూటింగ్ సగం పూర్తయ్యే సమయానికి అనుకున్న మొత్తం ఖర్చు అయిపోయిందని వెల్లడించారు. ఇంకా సగం సినిమా చిత్రీకరించాల్సి ఉండటంతో పరిస్థితి మారిందని చెప్పారు. సినిమా పూర్తయ్యే సమయానికి ఖర్చు దాదాపు డబుల్ అయ్యిందని వారు పేర్కొన్నారు. దీంతో ఇండస్ట్రీలో కూడా మూవీ కంప్లీట్ అవుతుందా? విడుదల అవుతుందా? అనే సందేహాలు వ్యక్తమయ్యాయని గుర్తు చేశారు.నిర్మాతలుగా తమకు అప్పటికే నష్టం తప్పదనే విషయం అర్థమైందని, అయినప్పటికీ వెనక్కి తగ్గలేదని చెప్పారు. ఆ మొత్తం జర్నీలో ప్రభాస్ హెల్ప్ ను నిర్మాతలు ప్రత్యేకంగా ప్రస్తావించారు. సినిమా విడుదలయ్యే వరకు ఆయన పూర్తిగా అండగా నిలిచారని తెలిపారు. కష్టకాలంలో హీరో సహకారం తమకు ఎంతో ధైర్యం ఇచ్చిందని పేర్కొన్నారు. ఆ పరిస్థితుల్లో ప్రభాస్ మద్దతు లేకపోయి ఉంటే సినిమా మధ్యలో ఆగిపోయేదేమో అన్న భావన వారి మాటల్లో కనిపించింది.

అదే సమయంలో దర్శకుడు రాఘవ లారెన్స్ పనితీరుపై నిర్మాతలు స్పందించారు. ఆయన తనకు కావాల్సిన విషయంలో రాజీపడే వ్యక్తి కాదని చెప్పారు. సినిమా క్వాలిటీ విషయంలో ఎలాంటి తగ్గింపులు అంగీకరించరని తెలిపారు. అయితే బడ్జెట్ పరంగా అది నిర్మాతలకు భారంగా మారిందని వెల్లడించారు. అయినా సరే, మొదటి రోజు ముహూర్తం సమయంలో ఎంత ఉత్సాహంగా ఉన్నామో, చివరి వరకు అలాగే సినిమాను పూర్తి చేసి ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చామని చెప్పారు.

రిజల్ట్ నిరాశపరిచినా, నిర్మాతలుగా తమ బాధ్యత నుంచి వెనక్కి తగ్గలేదని స్పష్టం చేశారు. ఇప్పటివరకు రెబల్ గురించి అభిమానులు మాట్లాడుకునేది కేవలం దాని రిజల్ట్ గురించే. కానీ నిర్మాతల లేటెస్ట్ కామెంట్స్ చూస్తే, ఆ సినిమా వెనుక ఎన్నో ఫైనాన్షియల్ స్ట్రగుల్స్ దాగి ఉన్నాయని తెలుస్తోంది. ముఖ్యంగా ప్రభాస్ కోపరేషన్ లేకపోయి ఉంటే రెబల్ రిలీజ్ కాకుండా, మధ్యలో షెడ్డుకెళ్లిపోయేదన్న చర్చ జరుగుతోంది.



# తన పేరుతో సైబర్ మోసాలు.. నకిలీ నంబర్‌ను షేర్ చేస్తూ అభిమానులను హెచ్చరించిన హీరోయిన్ మీనాక్షి చౌదరి!

'లక్కీ భాస్కర్' సినిమా ఘనవిజయంతో టాలీవుడ్‌లో మంచి క్రేజ్ సంపాదించుకున్న కథానాయిక మీనాక్షి చౌదరి తాజాగా ఒక పెద్ద సైబర్ మోసంపై స్పందించారు. తన పేరుతో కొందరు కేటుగాళ్లు ప్రజలను, అభిమానులను బురిడీ కొట్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఆమె గుర్తించారు. తనలా నటిస్తూ మోసాలకు పాల్పడుతున్న ఒక గుర్తుతెలియని వ్యక్తి వ్యవహారాన్ని సోషల్ మీడియా వేదికగా బయటపెడుతూ ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు సదరు నకిలీ వ్యక్తి వాడుతున్న ఫోన్ నంబర్‌ను స్క్రీన్ షాట్ తీసి తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో మీనాక్షి పోస్ట్ చేశారు. ఈ నంబర్ నుండి ఎవరికైనా మెసేజ్‌లు లేదా ఫోన్ కాల్స్ వస్తే నమ్మవద్దని, వెంటనే ఆ నంబర్‌ను బ్లాక్ చేసి రిపోర్ట్ చేయాలని కోరారు. అది తన నంబర్ కాదని స్పష్టం చేసిన ఆమె, ఈ మోసాన్ని సకాలంలో గుర్తించి తన దృష్టికి తీసుకువచ్చిన నెటిజన్లకు, అభిమానులకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. ఇక సినిమాల విషయానికి వస్తే, మీనాక్షి చౌదరి ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస క్రేజీ ప్రాజెక్ట్‌లతో ఫుల్ బిజీగా ఉన్నారు. అందులో ముఖ్యంగా అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న 'వృషకర్మ' చిత్రంపై సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. కార్తీక్ దండు దర్శకత్వంలో మైథలాజికల్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కుతోంది.

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publishers, Flat No : 504, Bharat Towers, 5th Lane Dwarakanagar, Visakhapatnam, Andhra Pradesh - 530016, And Published At 1-17-1, Badeti Ramana Street, Near Mla House, 30th Word, Thadepalligudem , Editor Gantyada Apparao. PRGI Registration No. "APTEL/25/A2834, E-Mail : Editorpenpower@Gmail.Com, Mobile: 9059465965